Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 170 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 జూలై 2023 మంగళవారం పేజీలు : 4

## ఏపీ, తెలంగాణల్లో చెదురుమొదురు వర్షాలు

విశాఖపట్నం : బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింతగా బలపడి.. వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని అనుకొని కొనసాగుతోంది. ఇది ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ ఒరిస్సా ఉత్తర కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. తూర్పు, పశ్చిమ గోదావరిలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణ, మిగతా ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల్లో కూడా చెదురుమొదురు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది.



# వాళ్ళందరి చూపు కాంగ్రెస్ వైపు...!

## హస్తం పార్టీ అనూహ్యంగా పుంజుకోవడంతో బీఆర్ఎస్ - బీజేపీలో కంగారు!

## వలసలు ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా!!

హైదరాబాద్ : త్రిముఖ పోరు నెలకొంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి లాభపడదామని లెక్కేసుకుంది..! ప్రత్యర్థి పార్టీ పైకి లేచేలోగా గెలుపును సొంతం చేసుకోవాలని ఆశపడింది..! ఈ అంచనాకు భిన్నంగా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతుండడంతో కంగారెత్తిపోతోంది..! ఇదీ రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ ప్రస్తుత స్థితి. సమీకరణాలు తలకిందులవుతుండడంతో పరిస్థితి చేయి దాటిపోతోందా? అని ఆ పార్టీలో గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. ఇది అసలుకే మోసం తెస్తుందా? అనే సందేహం వారిలో కలుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మంవ్యాప్తంగా బలమైన వర్గం, ప్రజాదరణ ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెసలో చేరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు సైతం హస్తం గూటికి చేరనున్నారు. మరో మాజీ ఎమ్మెల్యే యెన్నం ఇదే యోచనలో ఉన్నారు. ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అనుచరులతో కాంగ్రెస్‌లోకి వెళ్లేలా చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ ఒకదానివెంట ఒకటి జరుగుతుండడం.. రాబోయే రోజుల్లో ఇంకా వలసలు పెరిగే అవకాశం కనిపిస్తుండడంతో బీఆర్ఎస్ బేజారవుతోంది. అసలే నిర్దిష్ట ఓటు బ్యాంకు ఉన్న కాంగ్రెసను.. కాలం కలిసొస్తే ఆపలేమన్న ఆందోళన గులాబీ దళంలో వ్యక్తమవుతోంది.

**అటు నుంచి ఇటు నుంచి...** తమ పార్టీ నుంచే కాక బీజేపీ నుంచి కూడా కాంగ్రెసలోకి చేరికలకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ ఆందోళన చెందుతోంది. తమ వారు అటు వెళ్లకుండా సాధ్యమైనంత వరకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. కాగా, కొన్ని నెలల కిందటి వరకు రాష్ట్రంలో బీజేపీ ప్రభావం ఉంది. ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు పెద్దఎత్తున అందులో చేరారు. బీజేపీ జాతీయ స్థాయి నాయకత్వం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడేవారు. ఈ నేపథ్యంలో బీజేపీ పట్ల ప్రజల్లో కొంత క్రేజ్ ఏర్పడింది. ఎన్నికల్లో త్రిముఖ పోటీపై అంచనాలు ఉండేవి. అయితే, కర్ణాటక ఎన్నికల్లో పరాజయం, ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితపై చర్యలు తీసుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరితో రాష్ట్ర బీజేపీ ఆత్మరక్షణలోకి వెళ్లింది. ఆ పార్టీ నాయకులు కొందరు కాంగ్రెసలో చేరడానికి సిద్ధమవుతున్నారు. దాంతో బీజేపీ వెనుకబడి, కాంగ్రెస్ ముందుకు వస్తుందన్న చర్చ ప్రజల్లో మొదలైంది.

**బీజేపీతో కలిసిపోయారనే పేరుతో..** బీజేపీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరడం సైతం బీఆర్ఎసకు పరోక్షంగా చేటు చేస్తోంది. ఈ ప్రభావం ఏ మేరకు ఉంటుందోనని అధికార పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను మార్చి, ఆయన స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నియమించారు. ఇది ఆ పార్టీలోని ఓ వర్గం నేతల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైనట్లు వార్తలు వస్తున్నాయి. పైగా, బీఆర్ఎసతో అనధికారికంగా కుదిరిన ఒప్పందం కారణంగానే బీజేపీలో మార్పులు చేశారన్న ప్రచారం జరుగుతోంది. తద్వారా బీఆర్ఎస-బీజేపీ ఒక్కటేననే భావన ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఈ ప్రచారం కొనసాగితే పార్టీకి మంచిది కాదనే అభిప్రాయంలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.

**వ్యతిరేక ఓటు చీలకుంటే..** బీజేపీ పూర్తిగా వెనక్కుపోయి.. కాంగ్రెసతో ముఖాముఖి తలపడాల్సిన పరిస్థితి వస్తే.. తమకు నష్టం కలిగే అవకాశాలే ఎక్కువని బీఆర్ఎస్ పెద్దలు భావిస్తున్నారు. ముక్కోణపు పోటీ నెలకొని.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలే విధంగా సమీకరణాలు ఉండాలని ఇప్పటివరకు వారు లెక్క వేసుకున్నారు. ఇది జరగాలంటే కాంగ్రెసలోకి వలసలను కొంత అడ్డుకట్ట వేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. హస్తం పార్టీలోకి వెళ్లాలని భావిస్తున్న నాయకులతో బీఆర్ఎస్ పెద్దలు వరుసగా సమావేశం అవుతున్నారు. "మీరు పార్టీ మారొద్దు.. భవిష్యత్తులో మంచి అవకాశాలను కల్పిస్తాం" అంటూ హామీలిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీపై ఇలా తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఆయనతో మంత్రి కేటీఆరే కాక, ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా చర్చించినట్లు సమాచారం.

**వారినే మనవైపు లాక్కుందాం..** జిల్లాల్లో బలమైన నేతలు కాంగ్రెసలో చేరడం అంటే.. ఆ పార్టీ బలోపేతం అవుతోందనే అర్థమనేది బీఆర్ఎస్ వర్గాల బెంగ. ఇలాగైతే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నువ్వా నేనా అనే స్థాయికి వెళ్తుందని భావిస్తున్నారు. ఆ పరిస్థితి రావద్దంటే.. ముందునుంచే కట్టడి చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇందులోభాగంగా తమ నాయకులు కాంగ్రెసలోకి వెళ్లకుండా చూడడం, కాంగ్రెస్ వారిని తమవైపు లాగేసుకోవడం అనే ద్విముఖ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కొందరు కాంగ్రెస్ నేతలతో తీవ్రంగా చర్చిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా చేరేవారిలో కొందరికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తామనే ఆశ కూడా చూపుతున్నారు. అది వీలుకాకుంటే భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామనే హామీ ఇస్తున్నారు.




ఢిల్లీ : నేడు సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కేసు విచారణకు రావాల్సి ఉంది. అయితే ఈ కేసు విచారణ వాయిదా పడింది. లిక్కర్ కేసులో తనకు ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని, సుప్రీంకోర్టును కవిత ఆశ్రయించిన విషయం తెలిసిందే. తనపై ఎలాంటి బలవంతపు చర్యలూ ఈడీ తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కవిత కోరారు. అయితే సుప్రీంకోర్టులో కోర్టు నంబర్ 2, 8 కార్యకలాపాలు రద్దు అయ్యాయి. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అందుబాటులో లేని కారణంగా నేటి కోర్టు నంబర్ 2 కార్యకలాపాలు రద్దయ్యాయి. దీంతో కవిత కేసుపై కూడా విచారణ వాయిదా పడింది. కోర్టు నంబర్ 2 ముందు జాబితా చేయబడిన కేసుల విచారణ ఈరోజు లేదని వాయిదా వేసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. జస్టిస్ ఎస్. రవీంద్ర భట్ అందుబాటులో లేకపోవడంతో తో కోర్టు నంబర్ 8 కార్యకలాపాలు రద్దయ్యాయి. కోర్టు నంబర్ 2, 8 లో రద్దయిన కేసుల విచారణ తేదీలు త్వరలో తెలియజేయబడతాయని సుప్రీంకోర్టు వెల్లడించింది.

## ఆసక్తికరంగా స్టేషన్ ఘనపూర్ రాజకీయాలు.. బీఆర్ఎస్ అధిష్టానానికి పరీక్ష..




జనగామ : స్టేషన్ ఘనపూర్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మరోవైపు బీఆర్ఎస్ అధిష్టానానికి పరీక్షగా మారాయి. స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ టికెట్‌పై అధిష్టానంతో అమీతుమీ తేల్చుకునేందుకు కడియం శ్రీహరి-తాటికొండ రాజయ్య సిద్ధమయ్యారు. ఎవరికి టికెట్ ఇచ్చి మరొకరికి ఇవ్వకున్నా ఇబ్బందే. ఇద్దరికీ ఒకే పార్టీ నుంచి టికెట్ ఇవ్వడం సాధ్యం కాదు. మొత్తమ్మీద స్టేషన్ ఘనపూర్ రాజకీయాలు అధిష్టానానికి పరీక్షగా మారాయి. తనపై రాజయ్య చేసిన సంచలన ఆరోపణలను పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు కడియం ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్టీ పెద్దలను కలిసేందుకు కడియం శ్రీహరి వెళ్లారు. అధిష్టానం పెద్దల సూచనల తర్వాతే కడియం స్పందించే అవకాశం ఉంది. వచ్చే ఎన్నికల్లో పోటీకి ఇద్దరు నేతలూ సిద్ధమవుతున్నారు. అధిష్టానం చూపు ఎవరివైపు అనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. దమ్ముంటే కడియం శ్రీహరి తనతో చర్చకు రావాలని రాజయ్య సవాల్ విసురుతున్నారు.

# మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారు!



## తెలుగు రాష్ట్రాల్లో 'అమాత్యా' అనిపించుకునేదెవరో..!!?

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం అవుతోంది. ఈ నెల 12న లేదంటే 18న మంత్రివర్గ ప్రక్షాళన ఖాయమని తెలుస్తోంది. ఈ వారంలోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా దీనికి సంబంధించిన కసరత్తు పూర్తి చేసారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి కేబినెట్ లో స్థానం ఉంటుందని చెబుతున్నారు. పునర్వ్యవస్థీకరణ కు రంగం సిద్దం: ఈ వారంలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగటం ఖాయంగా కనిపిస్తోంది. -14 తేదీల్లో ప్రధాని మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్తున్నందున.. ఆలోపే మంత్రివర్గంలో మార్పులు చేసే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు అంచ నా వేస్తున్నాయి. ఇప్పటికే పార్టీలో, ప్రభుత్వంలో ఎవరెవరికి ఏయే బాధ్యతలు అప్పగించాలన్న విషయంపై కసరత్తు పూర్తయింది. వచ్చే వారం గవర్నర్లు, ముఖ్యమంత్రుల మార్పులకు సంబంధించి కీలక నిర్ణయాలు ఉంటాయని తెలుస్తోంది. పలువురు మంత్రులకు వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలు అప్పగించటంతో కొత్త మంత్రులతో పునర్వ్యవస్థీకరణ ఖాయంగా మారింది. ఈ నెల 12నే మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ ఉందని పార్టీ ముఖ్య నేతలు అంచనా వేస్తున్నారు.

**పలువరు మంత్రులు ఔట్:** ఈ వారంలో సాధ్యపడకపోతే..పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు పూర్తయ్యే వరకు అవకాశం లేదు. దీంతీ, ఈ వారంలోనే పూర్తి చేస్తారనే ప్రచారం బీజేపీ నాయకత్వం భావిస్తోంది. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అర్జున్ రాం మేఘ్వాల్, భూపేంద్రయాదవ్, గజేంద్రసింగ్ షెఖావత్, ఎస్పీఎస్ బఘేల్, ప్రహ్లాద్ జోషితదితరులు బీజేపీ అధ్యక్షుడు నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్ తో సమావేశమయ్యారు. వీరిని పార్టీ సేవలకు వినియోగించుకుంటారని తెలుస్తోంది. ఆ తర్వాత ప్రహ్లాద్ జోషి, భూపేంద్ర యాదవ్‌లకు రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. 2021 జూలై7 తర్వాత మోదీ తన మంత్రివర్గాన్ని విస్తరించలేదు. అయిదు రాష్ట్రాల ఎన్నికలను బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది.

2024కి తన డ్రీం టీంను ఇప్పటికే మోదీ సిద్దం చేసుకున్నట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల నుంచి: తెలుగు రాష్ట్రాల నుంచి కేబినెట్ లో స్థానాల పైన అంచనాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ నుంచి బండి సంజయ్ కు కేబినెట్ లో స్థానం ఖాయమనే ప్రచారం సాగుతోంది. బండి తనకు మంత్రి పదవి వద్దని, కార్యకర్తగానే కొనసాగుతానని పార్టీ ముఖ్య నేతలకు స్పష్టం చేసారు.

అయితే, బండికి కేబినెట్ బెర్తు ఖాయమని..మంత్రి పదవి వద్దనే నిర్ణయానికే కట్టుబడి ఉంటే రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏపీ నుంచి జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేష్ పేర్లు రేసులో ఉన్నాయి. అదే సమయంలో అనూహ్యంగా మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పేరు పైకి వచ్చింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర మంత్రివర్గంలో చివరకు ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# సంపాదకీయం

## పోతామన్నోళ్లను.. పదవులతో కొడుతున్నారు..

## రిజల్ట్ వచ్చేనా?!

పోతారని తెలిస్తే.. చాలు పదవులు పంచేస్తున్నారు. ఏదో ఒక పదవి.. దానికి ప్రాధాన్యం ఉందా లేదా.. అనేది పక్కన పెడితే మొత్తానికి పేరు పక్కన ఒక డిసిగ్నేషన్ అయితే.. వచ్చేస్తోంది. అయినంత మాత్రాన.. పార్టీ గాడిలో పడుతుందా? నేతల మధ్య అసంతృప్తులు తగ్గుతాయా? అనేది ఇప్పుడు చర్చకు దారితీస్తున్న విషయం. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనేది పార్టీ పెద్దల వ్యూహం. ఇంత వరకుబాగానే ఉంది. కానీ.. ఈ వ్యూహానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలు భారీగా గండికొట్టాయి. అక్కడ కనుక బీజేపీ గెలిచి నిలిచి ఉంటే.. పరిస్థితి వేరేగా ఉండేది. తెలంగాణలోనూ కమల వికాసంపై నమ్మకం వచ్చి ఉండేది. కానీ అలా జరగలేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీనే నాలుగు రోజులు బెంగళూరులో తిష్టవేసినా.. ప్రజలపై వరాల జల్లు కురిపించినా.. ఫలితం సానుకూలంగా రాలేదు. ఈ ఎఫెక్ట్ తెలంగాణ రాజకీయాలపై ఎక్కువగానే కనిపిస్తోంది. ఎందుకంటే.. ఇప్పుడు బీజేపీలో ఉన్న పొరుగు పార్టీ నాయకులు(జంపింగులు) కోరుకుంటున్నది అధికారం. వచ్చే ఎన్నికల్లో అయినా.. తాము అధికారంలోకి రాకపోతే.. ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చే పార్టీకే జై కొట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బీజేపీని వీడేందుకు వారు రెడీ అయ్యారు. కానీ. ఎందుకో.. బీజేపీ వీరి విషయంలో వంద మెట్లు దిగివచ్చిందనే చెప్పాలి. ఈ క్రమంలోనే అడిగిన వారికీ.. అడగని వారికీ.. ముఖ్యంగా పోతామన్నోళ్లకు కూడా పదవులు పందేరం చేసింది. ఈ పదవులకు పవర్ ఉందా? లేదా..? అనేది పక్కన పెడితే.. ఏదో ఒక స్థానం అయితే కల్పించారు. కాబట్టి.. వెళ్లిపోవాలని ప్లాన్ చేసుకున్నవారు కూడా.. పార్టీలోనే ఉండిపోతారని కమల నాథులు లెక్కలు వేసుకున్నారు. కానీ ఎన్ని చేసినా.. క్షేత్రస్థాయిలో పార్టీ కనుక పుంజుకునే పరిస్థితి లేకపోతే.. వీరు నిలిచే పరిస్థితి ఉండదని అంటున్నారు పరిశీలకులు. చివరకు ఈ ప్రయత్నాలు.. కేవలం చెప్పుకొనేందుకు మాత్రమే పరిమితం అవుతాయని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# అడ్డుకోరు.. అక్రమ కట్టడాల జోరు



నిర్మల్ : దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం నోయిడాలో అక్రమంగా నిర్మించిన జంట భవనాల కూల్చివేత ఘటన అంతటా చర్చనీయాంశంగా మారింది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయో చాటి చెప్పింది. ఈ ఉదంతం అక్రమ నిర్మాణదారులకు హెచ్చరికలా మారింది. జిల్లాలోనూ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం, అసైన్డ్ భూములు, కందకాలు, గుట్టలపై నిర్మాణాలు చేపడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేకుండానే వ్యాపార నిమిత్తం భవన సముదాయాలు నిర్మిస్తున్నారు. ఇలాంటి వాటిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు స్పందించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రాజకీయ ఒత్తిళ్లు ఇల్లు, భవన నిర్మాణాల విషయంలో అవినీతికి ఆస్కారం లేకుండా టీఎస్-బీపాస్ తీసుకొచ్చినా.. కొంతమంది నేతలు, అధికారుల తీరుతో కట్టడి లేకుండా మారింది. ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకునేలా వీలు కల్పించినా.. దీనిని కొందరు తమ స్వార్థానికి ఉపయోగించుకున్నారు. వాస్తవానికి భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు చేసుకున్న తర్వాత వాటిని టాస్క్‌ఫోర్స్ బృందాలు పరిశీలన చేయాల్సి ఉంది. మున్సిపల్‌తోపాటు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అదికారులు సభ్యులుగా ఉండే ఈ కమిటీ 15 రోజులకోసారి భవన నిర్మాణ అనుమతులు సమీక్ష నిర్వహించాల్సి ఉన్నా.. ఇక్కడ మొక్కుబడిగా జరుగుతున్నాయి. అక్రమ కట్టడాలు చేపట్టితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసే అధికారం ఈ కమిటీకి ఉన్నా.. రాజకీయ ఒత్తిళ్లకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తూ..

భవన నిర్మాణ అనుమతులన్నీ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి టీఎస్-బీపాస్‌కు మారడంతో అనుమతి కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి రావడంతో భవన నిర్మాణాలను తనిఖీ చేయడం లేదు. ఇందులో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని నాలుగు అంతస్తులను నిర్మించుకుంటున్నారు. సెట్‌బ్యాక్ వదలడం లేదు. ఇలాంటి కట్టడాలు పెరిగినట్లు 'పుర' అధికారులు వెల్లడించారు. ఏడాది కాలంలో జిల్లా కేంద్రంలో పలు వార్డుల్లో 30 వరకు ఫిర్యాదులు వచ్చినట్లు స్పష్టం చేశారు. నిర్మల్‌లోని దివ్యనగర్, శాస్త్రినగర్, ప్రియదర్శినినగర్, రాంనగర్, ఈద్గాం చౌరస్తా, భాగ్యనగర్, ఇంద్రానగర్, తదితర ప్రాంతాల్లో నిర్మించిన.. నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఖాళీ స్థలం వదలడం లేదు. అపార్ట్‌మెంట్ నిర్మాణదారులు అధికారులకు కాసులు ముట్టజెప్పుండటంతో నిబంధనలు పక్కనపెట్టి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొన్ని ఉదాహరణలు.."జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ నుంచి మంచిర్యాల వెళ్లే రోడ్డులో ఆర్నెళ్ల క్రితం ఓ వాణిజ్య సముదాయం నిర్మించారు. నిబంధనలు అతిక్రమించారని అధికారులు దానికి అనుమతులు నిరాకరించారు. ఆ తర్వాత కొందరు నేతలు రంగప్రవేశం చేయడంతో అధికారులు అనుమతులు మంజూరు చేయాల్సి వచ్చింది. అధికారులు, నాయకులకు ముడుపులు ముట్టజెప్పారనే ఆరోపణలు వచ్చినా.. చర్యలు తీసుకోలేదు."నిర్మల్ పట్టణం పాతబస్టాండ్ వెళ్లే మార్గంలో ఓ భవన సముదాయాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. టీఎస్-బీపాస్ కింద మొదటి అంతస్తు అనుమతి తీసుకున్నా.. తర్వాత ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దానిపై మరో అంతస్తు నిర్మించారు. అధికారులు కొద్ది రోజులు పనులు నిలిపివేసే ప్రయత్నం చేసినా.. ఆ భవనం ఓ నేత బంధువు నిర్మించడంతో వారు మిన్నకుండిపోవాల్సి వచ్చింది."

"జిల్లా కేంద్రంలోని శాంతినగర్, సోఫినగర్, వెంకటాపూర్, గాజుల్‌పేట్, తదితర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో అనుమతుల్లేకుండా ఇళ్లు, భవన నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రియదర్శినినగర్, భాగ్యనగర్, ఇంద్రానగర్, ద్యాగవాడ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని కందకాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు."

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు- సుమలత, టీపీవో, పురపాలక సంఘం, నిర్మల్‌పురపాలక కొత్త చట్టం ప్రకారమే భవనాలు నిర్మించాలి. టాస్క్‌ఫోర్స్ బృందాలు పరిశీలన చేసిన తర్వాతే అనుమతులు మంజూరవుతాయి. ప్రమాణాల మేరకు లేని వాటిపై చర్యలు తీసుకుంటాం. అనధికార, అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం.

# ప్రబలుతున్న జ్వరాలు



రాయికల్ : రాయికల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో డెంగీ జ్వరాలు పంజా విసిరాయి. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన చిన్నారి జ్వర లక్షణాలతో మృతి చెందడం తీవ్రతకు అద్దం పడుతుంది. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. గత పక్షం రోజులుగా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నామని వైద్యశాలకు వెళ్తే పరీక్షలు నిర్వహించి డెంగీ పాజిటివ్ అని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. వైద్యానికి వేలల్లో ఖర్చు అవుతుందని, కూలీ పని చేస్తేగాని కుటుంబాన్ని వెళ్లదీయలేని పరిస్థితుల్లో వైద్యం కోసం ఖర్చు చేయడానికి అప్పులు చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లోపాలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు గ్రామాల్లో, వార్డులో ఫ్రైడే డ్రైడే పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం ఉండటం లేదు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో పాటు వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా అడుగులు పడటం లేదు. చిన్నపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారుతుండడం మరో కారణంగా నిలుస్తుంది.


దుర్గంధానికి నిలయాలు

పట్టణంలో సుమారు 70 కి.మీ మేర మురుగు కాల్వల నిర్మాణం అవసరం కాగా కేవలం 40 కి.మీ మేర నిర్మాణాలు ఉన్నాయి. వీటిలో 10 కి.మీ మేర మురుగు కాల్వలు వాటి లైనింగ్ దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. పట్టణ ప్రగతి పనుల్లో 1197 మీటర్ల నూతన మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించారు. 10, 11, 5, 6వ వార్డుల్లో గతంలో నిర్మించిన మురుగు కాల్వలు లైనింగ్ దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతులు చేయాల్సి ఉంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రహదారులపైకి పారుతుంది. దీంతో దుర్వాసన రావడంతోపాటు దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలో మురుగు కాల్వల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయడంతో పాటు శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. దోమల నివారణకు యంత్రాల సంఖ్యను పెంచి ప్రతి రోజు ప్రతి కాలనీలో ఫాగింగ్ జరిగేలా చూడాలి.

నిరంతరం చర్యలు- గంగుల సంతోష్‌కుమార్, కమిషనర్, రాయికల్ దోమల నివారణకు ప్రత్యేక సిబ్బందిని పురమాయించి కాలనీల్లో ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్నాం. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని జెసీబీ యంత్రంతో తొలగించారు. కొన్ని చోట్ల ప్రత్యేక కాలవలు ఏర్పాటు చేయడంతోపాటు మోటార్లతో నిల్వనీటిని తొలగించాం. ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రతపై యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. నూతన మురగు కాల్వల నిర్మాణాలకు గతంలో ప్రతిపాదనలు సమర్పించాం. దశల వారీగా పనులు చేపడుతున్నాం.

# కాలుతున్న నియంత్రికలు

జగిత్యాల : వర్షాలు తగ్గుముఖం పట్టడం.. సాగు పెరగటంతో విద్యుత్తు వాడకం వారం రోజులుగా పెరిగిపోయింది.. వాడకం పెరగటమే కాదు.. ప్రతి రోజు విద్యుత్తు నియంత్రికలు కాలిపోతూనే ఉన్నాయి. నియంత్రికలను మార్చాలంటే రైతులపై భారం పడుతోంది. జిల్లాలో అన్ని కనెక్షన్లు 4,95,973 ఉండగా అందులో 1,31,847 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు అన్ని వ్యవసాయ కనెక్షన్లు ప్రతి రోజు వాడకం జరుగుతుండగా దీనికి తోడు అక్రమ కనెక్షన్లు కూడా ఉండటంతో లోడ్ పెరిగిపోయి నియంత్రికలు కాలిపోతున్నాయి.జిల్లాలో ప్రతి రోజు 15 నుంచి 20 నియంత్రికలు కాలిపోతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందులో జగిత్యాల డివిజన్‌లో ప్రతి రోజు 8 నుంచి 12 వరకు మెట్‌పల్లి డివిజన్‌లో 6 నుంచి 8 వరకు కాలిపోతున్నట్లు విద్యుత్తు అధికారులు తెలిపారు. అక్రమ కనెక్షన్లు గుర్తించి తొలగిస్తున్నప్పటికీ కొందరు మళ్లీ బిగిస్తున్నారు. అక్రమ కనెక్షన్ల కారణంగా అనుమతి పొందిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు కనెక్షన్ పొందితే అదనపు లోడ్ కోసం నియంత్రికలు బిగిస్తామని అధికారులు తెలిపారు. మరో వైపు కెపాసిటర్లు బిగించకపోవటం, ఆటో స్టార్టర్లతో నడపడం కారణంగా విద్యుత్తు మోటార్లు నిరంతరం నడిచి నియంత్రికలపై భారం పడతుందని, ఆటో స్టార్టర్లు తొలగించాలని, కెపాసిటర్లు బిగించుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ రైతులను కోరారు.



రైతులపై భారం...జిల్లాలో భారీగా కాలిపోతున్న నియంత్రికలతో రైతులపై భారీగా భారం పడుతోంది. నియంత్రికను సెంటర్ వరకు తెచ్చి మరోకటి తీసుకెళ్లటం, ట్రాక్టర్ ఖర్చు, కూలీలకు దూరభారాన్ని బట్టి రూ.5000 నుంచి రూ.6000 వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఎంతో కొంత ఇవ్వనిదే నియంత్రికలు ఇవ్వటంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంకా ఎండలు పెరిగి పోవటంతో వాడకం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇలా లోడ్ పెరిగే కొద్ది నియంత్రికలు కాలిపోయే అవకాశం ఉంది. రైతులకు భారం లేకుండా విద్యుత్తుశాఖనే కొత్తవి మార్చాలని రైతులు కోరుతున్నారు.

# ఉపాధిహామీ పనులకు కోత

ఆదిలాబాద్ : ఉపాధిహామీ పథకం కింద ఇన్నాళ్లు గ్రామాలవారీగా గుర్తించిన పను లకు ఆమోదం పొంది చేపట్టేవారు. దీంతో ఎన్ని పనులైన చేపట్టే అవ కాశం ఉండేది. కానీ కేంద్రం కొత్త నిబంధనలు పెడుతూ ఆదేశాలు జారీ చేసింది. ఏడాది మొత్తంగా ఒక గ్రామంలో 20 పనులకు మించి చేయ రాదనే షరతు పెట్టింది. దీంతో సగం పనులకు కోత పడే ప్రమాదం ఉంది. ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ఆమలులో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తున్నది. కాగా ఇప్పుడు నిర్వహణ కేంద్రం ఆదీనంలోకి వెళ్లింది. ఇందుకు ప్ర త్యేకంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసింది. ఒక గ్రామంలో 20 పనులకు మించి ఒకేసారి చేపట్టవద్దు. కొత్త పనులు చేపట్టాలంటే ప్రారంభించిన పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కూలీల హాజరు సైతం ఆన్‌లైన్‌లో చేసింది.

గ్రామసభ తీర్మానం ప్రకారం..గ్రామసభ తీర్మానం ప్రకారం ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆధిక మంది కూలీలు కోరుకున్న పనులు చేపట్టేవారు. హరితహరం, మొక్కలు నాటడం, చెరువుల్లో పూడికతీత, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, మ ట్టిరోడ్లు తదితర పనులు చేపట్టేవారు. గ్రామసభల్లో తీర్మానించిన పనుల వివరాలను అధికారులకు అందజేస్తే రెండు రోజుల్లో అమోదం పొంది పనులు ప్రారంభించేవారు. కాగా కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన నిబం ధనల ప్రకారం ఏడాదిలో ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో 20 పను లు మాత్రమే చేపట్టాలి. కేంద్రం నిర్దేశించిన 250 రకాల పనులే కొనసాగించాలి. దంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, ఇంకుడు గుంతలు, కిచెన్ షెడ్లు తదితర 20 పనులు చేపడితే వాటికి అనుమతులు ఉండవు. ఇందుకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేపట్టారు. కొత్త నిబంధనతో...కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీలో కొత్త నిబంధన అమలులోకి తీసుకు వచ్చింది. అవసరాలకు అనుగుణంగా ఒక గ్రామంలో ఎక్కువ, తక్కువ పనులు చేసేందుకు ఆవకాశం లేకండా ఒకే దఫాలో 20 పనులను మా త్రమే అనుమతించే అవకాశం కల్పించింది. హరితహారంలో మొక్కలు నాటడం మినహాయిస్తూ ఉపాధిహామీ ద్వారా గ్రామంలో చేపట్టే దంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, ఇంకుడుగుంతలు, తదితర 20కి మించి అనుమతించరాదని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఎంపిక చేసిన పని పూర్తయిన తర్వాతే మరో కొత్త పనిచేట్టాల్సి ఉంటుంది. కూలీల హాజరు..ఇది వరకు ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరు మ్యాన్‌వల్‌గా ఉండేది. ఆలా వచ్చి వెళ్లిపోయిన వారిపేరు మీద డబ్బులు కాజేసిన విషయాలు సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి అక్రమా లకు ఆస్కారం లేకుండా హాజరును ఆన్‌లైన్ చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్ మొబైల్ ఫోన్‌లో కూలీల మస్టర్‌తో కూడిన వివరాలు నమోదు చేస్తారు. పని ప్రదేశంలో రోజుకు రెండుసార్లు రెండు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 9గంటలకు, తిరిగి సాయంత్రం 5 గంటలకు ప్రతీ కూలీ మస్టర్‌లో సంతకం చేయాల్సి ఉంటుంది. రెండు సంతకాలు ఉంటేనే ఈ మేరకు 257 రూపాయలు చెల్లిస్తారు.

జిల్లాలో గ్రామ పంచాయతీలు: 335జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలు: లక్ష 30వేలునమోదైన కూలీల సంఖ్య: 2.77 లక్షలుయాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు: 95వేలుఈ ఏడాది పనిదినాల లక్ష్యం : 29.72 లక్షలుఇప్పటి వరకు పూర్తయినవి: 26.47లక్షలువెచ్చించిన నిధులు: రూ. 54.67 కోట్లు

సాఫ్ట్‌వేర్‌లో మార్పులు..- సురేందర్, డీఆర్డీవోఒక్కో జీపీలో 20 పనులు మాత్రమే చేపట్టేలా సాఫ్ట్‌వేర్‌లో కేంద్రం మార్పులు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిబం ధనల ప్రకారం పనుల కల్పిస్తున్నాం. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీల హాజరును పని ప్రదేశం నుంచే సిబ్బంది నమో దు చేస్తున్నారు.

# సాగులో అద్దె యంత్రాలు

ఆదిలాబాద్ : పశుసంపద తగ్గడం, కూలీల సమస్య తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఏర్పడింది. దుక్కి మొదలు పంట కోత వరకు అవసరమయ్యే ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. బడా రైతులు యంత్రాలతో ఆధునిక సేద్యం చేస్తున్నప్పటికి చిన్న, సన్నకారు రైతులకు యంత్రాలు కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారింది. అలాంటి రైతులకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్లు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. వీటి ద్వారా రైతులకు తక్కువ ధరకు అద్దె యంత్రాలు, పరికరాలు. అందుతున్నాయి. రైతులు సాగుకు అవసరమైన యంత్రాలను అద్దెకు తీసుకొంటున్నారు. వీటితో ఖర్చు, సమయం, శ్రమ కలిసి వస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీల ఆధ్వర్యంలో నెన్నెల, కాసిపేట, భీమారం, జన్నారం మండలాల్లో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్లు విజయవంతంగా నడుస్తున్నాయి. రైతుల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో జిల్లాలో మరో 12 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో ఉండేవి ఇవే కంబైన్డ్ హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, పవర్ ట్రిల్లర్లు, రోటోవేటర్లు, హాఫ్‌కేజీ వీల్స్, కల్లివేటర్లు, ఫ్లౌలు, ట్రాలీలు, థైవాన్ స్ప్రేయర్లు, కూరగాయలు, పండ్లు సరఫరా చేసే ప్లాస్టిక్ ట్రేలు, యంత్రాలు కస్టమ్ హైరింగ్ సెం టర్లలో అద్దె ప్రాతిపకదన తక్కువ ధరకే అందుబాటులో ఉన్నాయి. కం బైన్డ్ హర్వెస్టర్ ధర మార్కెట్‌లో గంటకు రూ.2500లు ఉండగా సీహెచ్ సీలో రూ.2200లు, రోటోవేటర్‌కు రోజుకు రూ.700లు ఉండగా రూ. 500లకు అద్దెకు ఇస్తున్నారు. పవర్ టిల్లర్‌కు రోజుకు రూ. 800లు, కల్టివేటర్, ఫ్లౌ, ట్రాలీలకు రోజుకు రూ.500లు, తైవాన్ స్ప్రేయర్‌లను రోజుకు రూ.250లకు ఇస్తున్నారు. డిమాండ్‌ను బట్టి అవసరమైన మరిన్ని ఉపకరణలను కొనుగోలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నిధులు... నిర్వహణ ఇలా...అద్దె యంత్రాలు, పనిముట్ల కేంద్రాల నిర్వహణను గ్రామైక్య సంఘాలు చూసుకుంటాయి. వీటి కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి బాధ్యతలు అప్పగించారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు కావాల్సిన మొత్తాన్ని స్త్రీనిధి బ్యాంకు నుంచి 50 శాతం, మండల సమాఖ్య నిధి నుంచి 25 శాతం, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) నుంచి 25 శాతం నిధులను సమకూరుస్తారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ.30 లక్షల నుం చి రూ. 50 లక్షలు వెచ్చిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డిమాండ్ ఉన్న యంత్రాలు, ఉపకరణాలను గుర్తించి వాటిని కొనుగోలు చేస్తున్నారు. సీహెచ్‌సీల ఏర్పాటుతో మహిళా సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయి. సన్న, చిన్నకారు రెతులే ఉండగా వారందరూ అద్దె పనిముట్లను ఉపయోగించుకో నున్నారు. సమయానికి యంత్రాలు లభిం చక అదను తప్పిన సందర్భాలున్నాయి.

## వైద్య కళాశాలలో ప్రత్యేక కోటా

కరీంనగర్ :సింగరేణి కార్మికుల పిల్లలకు వైద్య కళాశాలలో ప్రత్యేక కోటా కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గోదావరిఖనిలో నిర్మించిన వైద్య కళాశాలకు సింగరేణి సంస్థ రూ.500 కోట్లు కేటాయించింది. సంస్థ నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలో కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించాలన్న డిమాండ్ కోల్‌బెల్టు ప్రాంతంలో పెరిగింది. అదే విధంగా కళాశాలకు సింగరేణి పేరు పెట్టాలని కార్మికుల నుంచి ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గోదావరిఖనిలోని వైద్య కళాశాలకు సింగరేణి కళాశాలగా నామకరణం చేస్తూ ఇటీవల ప్రకటన చేశారు. సీట్ల కేటాయింపు విషయంపై స్పష్టత రాకపోవడంతో కార్మికులు దానికోసం ఆసక్తిగా ఎదురు చూశారు. దీనిపై కూడా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ప్రత్యేకంగా ఐదు శాతం కోటా కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. దీంతో సింగరేణి సంస్థ వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించిన రూ.500 కోట్ల నిధుల మేరకు సంస్థ పేరుతో పాటు కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించినట్లయింది. గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలకు ఏటా 150 సీట్లు కేటాయించారు. ఇందులో 23 సీట్లు అఖిల భారత కోటాలో కేటాయించనుండగా 127 సీట్లు రాష్ట్ర ర్యాంకు ప్రకారం ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం సింగరేణి కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద ఐదుశాతం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఏడు సీట్లు కేటాయించనున్నారు. రామగుండంలో వైద్య కళాశాల ఏర్పాటు ఈ ప్రాంతవాసులకు కలగా ఉండేది. ఎట్టకేలకు వైద్య కళాశాల ఏర్పాటు కావడంతో పాటు సింగరేణి కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయిస్తూ జీవో విడుదల కావడం పట్ల ఈ ప్రాంతంలో హర్షం వ్యక్తమవుతోంది.

మాట నిలబెట్టుకున్నాం

కోరుకంటి చందర్, ఎమ్మెల్యే, రామగుండం

ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. దానికి అనుగుణంగానే వైద్య కళాశాలను సాధించుకున్నాం. కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను కోరాం. ఈ మేరకు ఐదుశాతం సీట్లు కేటాయించారు. సింగరేణి కళాశాలగా నామకరణం చేశారు. వైద్యం కోసం వచ్చే కార్మికులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయిస్తాం.

## అయిదేళ్లుగా.. సాగని పనులు

కరీంనగర్ :రహదారి పనులు ఐదేళ్లుగా మొదలుకాకపోవటంతో నగరపాలక తీరుపై ఈ ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారి వెడల్పు కోసం ఐదువైపులా ఇటీవల ఇక్కడి దుకాణాలను కూల్చిన అధికారులు వారికి మరోచోట దుకాణాలను కూడా కేటాయించలేకపోయారు. ఐదేళ్లుగా కేవలం 700 మీటర్ల రహదారి నిర్మాణం పూర్తి కావడం లేదు. ఈ కారణంగా స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.2 కోట్ల నిధులతో...

పట్టణ ప్రగతి నిధుల కింద గత ఐదేళ్ల క్రితం గౌతమినగర్ నుంచి ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ అడ్డరోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. నిధులు సరిపోకపోవటంతో కేవలం ఎన్టీపీసీ ఎ-గేట్ వరకు మాత్రమే నిర్మించి విడిచిపెట్టారు. అక్కడి నుంచి ఎఫ్‌సీఐ అడ్డరోడ్డు వరకు కేవలం 700 మీటర్ల రహదారి నిర్మాణం విషయంలో అధికారులు దృష్టి సారించలేదు. ఇటీవల రూ.2 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పట్టణ ప్రగతి నిధుల నుంచి ప్రధాన రహదారితో పాటు సర్వీసు రహదారి నిర్మాణ పనులు మొదలుపెట్టే దశలోనే నిలిచిపోయింది. నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని గత ఫిబ్రవరి 1న లాంఛనంగా చేపట్టారు. ఐదు నెలలు గడుస్తున్నా ఈ రహదారి నిర్మాణానికి నోచుకోవటం లేదు.

కేటాయించని దుకాణాలు..

గౌతమినగర్ సమీపంతోపాటు ఎఫ్‌సీఐ అడ్డరోడ్డులో రహదారి పక్కన దాదాపు 30 దుకాణాలను నగరపాలక సంస్థ నిర్మించింది. ఏడాది పూర్తయినా వీటిని ఎవరికీ కేటాయించ లేదు. ఆ నెల క్రితం కేటాయిస్తున్నట్లు ఏర్పాట్లు చేసినా వీటిని ప్రారంభించకపోవటంతో ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వీటిని వెంటనే కేటాయించాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

డివైడర్లు లేక ప్రమాదాలు

ఎన్టీపీసీ ఎ-గేట్ నుంచి గౌతమినగర్ వరకు ప్రధాన రహదారి నిర్మాణం



ఏడాది క్రితం పూర్తయింది. ఎ-గేట్ సమీపం నుంచి ప్రగతినగర్ వరకు డివైడర్లు లేక రహదారిపై వాహనాలు అటు ఇటుగా వెళుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ మార్గంలో వీధిదీపాలు లేకపోవటంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. డివైడర్లు నిర్మించి వీధిదీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రధాన మార్గం గుంతలమయం

ఎన్టీపీసీ ఉద్యోగులతో పాటు రామగుండం ఎరువుల కర్మాగారంతో పాటు గోదావరిఖనికి వెళ్లడానికి ఎక్కువ మంది ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఎఫ్‌సీఐ అడ్డరోడ్డు నుంచి ఎ-గేట్ వరకు రహదారి పూర్తిగా ఛిద్రమైపోయింది. ఈ మార్గంలో ఎరువుల కర్మాగారానికి ఎక్కువ రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గం పూర్తిగా గుంతలమయం కావటంతో ఎదురుగా వాహనం వస్తే వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గుంతలు మరింత ఎక్కువయ్యాయి. గత వర్షాకాలంలో తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ప్రస్తుతం పరిస్థితి మొదటికొచ్చింది.

నిరసన తెలిపినా స్పందన లేదు

రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని పక్షం రోజుల క్రితం నగరపాలక కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాం. అయినా అధికారుల్లో స్పందన లేదు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లాం. నగర పాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనుల తీరుపై ఈ ప్రాంతంలో తీవ్ర అసంతృప్తి ఉంది. కొలిపాక సుజాత, కార్పొరేటర్

# పల్లె దవాఖానా ప్రగతి అంతంతే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 'పల్లె దవాఖానా'లకు సొంత గూడు కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. ఏడాది కిందట ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. అధికారుల ఉదాసీన వైఖరితో పనులు పునాదుల దశ దాటడం లేదు. నిధులు మంజూరై నెలలు దాటినా నిర్మాణంలో పురోగతి లేదు. టెండర్లు పిలిచినా పలు చోట్ల గుత్తేదారులు ముందుకు రావడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యం, ఇతర కారణాలతో ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక నత్తనడకన సాగుతున్నాయి. నాసిరకమైన ఇసుక, కంకర వాడటంతో నాణ్యత లోపించింది. దీంతో నిర్మాణ దశలోనే పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పల్లె దవాఖానాల భవన నిర్మాణాల ప్రగతిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

జగిత్యాలలో అత్యధికం

పెద్దపల్లి జిల్లాలో 38 భవనాలకు నిధులు మంజూరు చేయగా 19 భవనాలకు టెండర్లు పిలిచారు. అయితే పనులు చేయడానికి గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడంతో ఆరు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 13 చోట్ల అసంపూర్తి దశలో ఉన్నాయి. రామగుండం పరిధిలోని విఠల్‌నగర్, ఎల్‌బీనగర్, జనగామ, అడ్డగుంటపల్లిలో భవనాలు నిర్మించేందుకు సింగరేణి పాత భవనాలను కేటాయించారు. వీటి తొలగింపునకు అదనపు నిధులు అవసరమవుతాయి. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పల్లె దవాఖానాల ప్రగతి కాస్త మెరుగ్గానే ఉంది. ఏడాది కిందట 35 కేంద్రాల పనులు ప్రారంభించారు. వీటిలో 24 చోట్ల పనులు పూర్తి చేయగా మరో 11 అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పనులు పూర్తయిన వాటిని ప్రారంభించడంలో జాప్యంతో రోగులకు సేవలందడం లేదు.

కరీంనగర్ జిల్లాలో 73 పల్లె ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో తీగలగుట్టపల్లి, రామడుగు, దేశ్‌రాజ్‌పల్లి, మాచిన పల్లిలలో భవనాలు పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తెచ్చారు. బావుపేట(ఆసీఫ్‌నగర్)లో స్థల సమస్య నెలకొంది. పరిష్కరిస్తే పనులకు మార్గం సుగమమవుతుంది. మిగిలిన ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. జగిత్యాల జిల్లాలో భవనాల ప్రగతి ఆందోళన కలిగిస్తోంది. స్థల సేకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా 102 భవనాలకు 2 చోట్ల మాత్రమే పనులు ప్రారంభించారు. మిగిలిన వాటికి టెండరు ప్రకియ పూర్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జగిత్యాలలోనే అత్యధికంగా మంజూరైనా ప్రగతి అటకెక్కింది.

అసంపూర్తిగా పనులు

మారుమూల ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దూరంగా ఉండటంతో ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. మండలకేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లడం కష్టసాధ్యమైంది. దీంతో 4-6 గ్రామాలను కలిపి ఒక కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. తెలంగాణ వైద్యా విధాన మౌలిక వసతుల కల్పన విభాగం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 248 పల్లె దవాఖానాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా 94 చోట్ల పనులు ప్రగతిలో ఉన్నాయి. 34 భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన పనులు టెండరు దశకే పరిమితమయ్యాయి. పనులు హడావుడిగా చేస్తుండటంతో నాణ్యత లోపిస్తోంది. నిర్మాణం పూర్తయిన చోట్ల కిటికీలు, తలుపులు బిగించక వదిలేశారు.

నిధులు పెంచినా నీరసమే

పల్లె దవాఖానా భవనాలకు ముందుగా రూ.16 లక్షలు కేటాయించారు. వీటితో వైద్యుడి గది, ల్యాబ్, వార్డు, స్టోర్ రూం, ఒక హాల్ నిర్మించాల్సి ఉంది. అయితే నిధులు సరిపోవడం లేదని పలువురు గుత్తేదారులు అధికారుల ముందు ప్రతిపాదించారు. జిల్లా స్థాయిలో ఒక్కో దానికి అదనంగా రూ.4 లక్షలు పెంచినా ఆశించిన మేర ప్రగతి కనిపించడం లేదు. ఒప్పందం ప్రకారం నాలుగు నెలల్లోగా భవనాలు నిర్మించి అప్పగించాలి. గడువు ముగిసినా పనులు గడప దాటడం లేదు. పక్కా భవనం లేక అద్దె గదులు, అరకొర వసతుల్లో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. దీంతో రోగులకు నామమాత్రంగా సేవలందుతున్నాయి.

# సూపర్ మార్కెట్లలో గోల్‌మాల్!



కరీంనగర్ : ప్రజల అవసరాలకు అనుగుణంగా సూపర్ మార్కెట్లు విస్తరిస్తున్నాయి. వస్తువులు, తినుబండారాలు, తదితరాలు బయటి నుంచే వినియోగదారులకు కనిపించే విధంగా ఉంటుండటంతో చాలామంది ఆకర్షితులై షాపింగ్‌మాళ్లకు వెళ్తున్నారు. ఇదే అదనుగా భావించి పలువురు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కరీంనగర్‌లో రెండు, మూడు మోసాలు బయటకు వచ్చాయి. స్పందించిన అధికారులు తనిఖీలూ చేశారు. పూర్తి వివరాలతో కథనం.

ఆఫర్ల పేరుతో...

కొన్ని సూపర్ మార్కెట్లు ఆఫర్ల పేరుతో వినియోగదారుల నెత్తిన శఠగోపం పెడుతున్నాయి. ఒకటి కొంటే మరొకటి ఉచితమని, ఎమ్మార్పీ కంటే తక్కువ ధర అంటూ కాగితాలపై రాసి అతికిస్తున్నారు. తీరా బిల్లులో మాత్రం రెండింటిపై బిల్లులు వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆఫర్ ముగిసిందని అంటున్నారని సమాచారం. ఇలాంటి ఘటన ఇటీవల ఓ సూపర్ మార్కెట్‌లో జరిగినట్లు తెలిసింది. మరికొన్ని చోట్ల ఒకటి కొంటే మరొకటి అని ఉచితమంటూ రెండింటి ధర తీసుకుంటున్నారు.

ఎమ్మార్పీలోనే జీఎస్టీ..

మనం కొనుగోలు చేసే వస్తువు ఎమ్మార్పీ కంటే అధికంగా ఒక్క పైసా కూడా చెల్లించకూడదు. ప్రతి ప్యాక్‌పై ఎమ్మార్పీలోనే జీఎస్టీ కలిపి ఉంటుంది. కొన్ని దుకాణాల్లో ఎమ్మార్పీ, జీఎస్టీ అంటూ వేర్వేరు ధరలు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిని వినియోగదారులు గమనించక అధిక బిల్లులు చెల్లిస్తూ మోసపోతున్నారు.

మేల్కొనండి ఇలా..

ఒకటి కొంటే మరొకటి అని బోర్డు పెడితే.. బిల్ కౌంటర్ వద్ద మరోసారి అడిగిన తర్వాతే తీసుకోండి

మీరు కొన్న వస్తువులు.. వేసిన బిల్లు ఒకసారి పరిశీలించండి. ఏదైనా తేడా అనిపిస్తే వెంటనే అక్కడి నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లండి.

ఏదైనా ఒక వస్తువు రెండు సార్లు బిల్లులో వచ్చిందో.. సరి చూసుకోండి.

కొన్ని ఉదాహరణలు..

ఇటీవల ఓ ఇద్దరు వ్యక్తులు ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లి నిత్యావసర సరకులు, వస్తువులు కొనుగోలు చేశారు. కొన్న వాటిలో కొన్నింటిని రెండుసార్లు స్కాన్ చేయడంతో రెండు వస్తువులకు బిల్లు చెల్లించాల్సి వచ్చింది. ఇంటికెళ్లిన తర్వాత బిల్లు, వస్తువులు పరిశీలిస్తే అదనపు బిల్లు చెల్లించామని తెలుసుకున్నారు. ఈ విషయంపై వారు తూనికలు కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేసి తిరిగి డబ్బులు ఇప్పించారు.

ఓ వ్యక్తి సూపర్ మార్కెట్‌కు వెళ్లి సర్ఫ్ కొనుగోలు చేశారు. అక్కడ ఒకటి కొంటే మరొకటి ఉచితమని రాసి పెట్టారు. తీరా బిల్లు మాత్రం రెండింటికి వేశారు. ఇదేమిటని అతను ప్రశ్నిస్తే ఆఫర్ నిన్నటికే ముగిసిందని సిబ్బంది సమాధానం చెప్పారు. మరో సూపర్ మార్కెట్‌లో ఓ వ్యక్తి పండ్లు తీసుకుందామని వెళ్లారు. కిలో రూ.200కు అమ్మే పండ్లను ఆఫర్ కింద రూ.160కి ఇస్తున్నట్లు రాసిపెట్టారు. తీరా కౌంటర్ వద్ద బిల్లు చెల్లించే సరికి కిలో పండ్ల ధర రూ.200 వేశారు. ఇలా కొన్ని సూపర్ మార్కెట్లలో వినియోగదారులను గోల్‌మాల్ చేస్తున్న ఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి.

అప్రమత్తత అవసరం

సూపర్ మార్కెట్లలో నిత్యావసరాలు, వస్తువులు కొనుగోలు చేసినప్పుడు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. బిల్లు చెల్లించిన తర్వాత వస్తువులను ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలి. ఏదైనా తేడా వస్తే షాపింగ్‌మాల్ సిబ్బంది దృష్టికి, అవసరమైతే తూనికల కొలతల శాఖ అధికారుల దృష్టికి తేవాలి. ప్యాకింగ్ చేసి అమ్మే వాటి విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. విజయసారథి, సహాయ నియంత్రణాధికారి, తూనికలు, కొలతల శాఖ


# పగలు ఎత్తిపోతలు.. రాత్రి విరామం

ధర్మారం : అదను దాటకముందే విత్తనం వేసేందుకు.. నార్లు పోసుకునేందుకు సకాలంలో సాగునీరందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న కాళేశ్వరం ఎత్తిపోతలను ప్రారంభించగా, నాలుగు రోజులుగా నిరాటంకంగా సాగుతున్నాయి. ఎస్సారెస్పీ సహా ఇతర ప్రాజెక్టుల పరిధిలోని 18.82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, మధ్యమానేరు జలాశయం ద్వారా 1.65 లక్షల ఎకరాలు, రంగనాయకసాగర్, అన్నపూర్ణ జలాశయం, కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌ల ద్వారా కొత్తగా అందుబాటులోకి వచ్చిన 1.25 లక్షల ఎకరాలకు ఈ వానాకాలానికి సమృద్ధిగా సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంతటి వర్షాభావ పరిస్థితులు ఎదురైనా సరిపడా సాగు, తాగునీటిని అందించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. తద్వారా ప్రాజెక్టు నిర్మాణానికి ఎందుకు ప్రాధాన్యమివ్వాల్సి వచ్చిందో విమర్శకులకూ తెలుస్తుందనే అభిప్రాయంతో పాలకులున్నట్లు సమాచారం.

వర్షాలను గమనిస్తూ నిర్వహణ

పథకంలోని అన్ని పంపుహౌస్‌లలోనూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మోటార్లు నడుపుతున్నారు. రాత్రి పూటతో పోలిస్తే పగటి పూట విద్యుత్తు డిమాండ్ తక్కువగా ఉండటంతో ఆ సమయంలో ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు. రెండు రోజులుగా తిరిగి వర్షాలు మొదలవడం, రుతుపవనాల ప్రభావం, గోదావరి, ఉపనదులు, వాగుల ఇన్‌ఫ్లోలను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. గతంలో ఎత్తిపోతలు చేపట్టాక భారీ వర్షాలతో నీటిని దిగువకు వదిలిపెట్టక తప్పని అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి ఎత్తిపోతలు కొనసాగిస్తున్నారు. వర్షాలు ఆశాజనకంగా లేకుంటే వచ్చే వారం నుంచి రాత్రింబవళ్లు నిరంతరాయంగా ఎత్తిపోతలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ముందుగా ఎస్సారెస్పీలోకి..



ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులకు ప్రయోజనం కలిగేలా మొదట ఎస్సారెస్పీకి నీటిని తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా వరద కాలువపై ఏర్పాటు చేసిన పంపుహౌస్‌ల ద్వారా శ్రీరాంసాగర్ వైపునకు తరలిస్తున్నారు. బుధవారం వరకు లక్ష్మీ పంపుహౌస్‌లో ఆరు మోటార్లను నడిపిన అధికారులు, 7 మోటార్లతో మేడిగడ్డ బ్యారేజీ నుంచి అన్నారం బ్యారేజీలోకి 14,833 క్యూసెక్కుల ప్రవాహాన్ని ఎత్తిపోశారు. సరస్వతి పంపుహౌస్‌లో 4 మోటార్లతో అన్నారం బ్యారేజీ నుంచి సుందిళ్ల బ్యారేజీలోకి 11,724 క్యూసెక్కులు, పార్వతి పంపుహౌస్‌లో నాలుగు మోటార్లతో 10,440 క్యూసెక్కుల చొప్పున సుందిళ్ల బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి జలాశయానికి తరలించారు. ధర్మారం మండలం నంది పంపుహౌస్‌లో రెండు మోటార్లను నడుపుతున్నారు. దీంతో 6,300 క్యూసెక్కులు మేడారం రిజర్వాయర్లోకి చేరుతున్నాయి. అక్కడి నుంచి ఏడో ప్యాకేజీలోని సొరంగాల ద్వారా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌కు వదిలారు. గాయత్రి పంపుహౌస్‌లో రెండు మోటార్లతో వరదకాలువలోకి ఎత్తిపోస్తున్నారు.

# చెరువులకు హద్దులేవి?

మిర్యాలగూడ : గతంలో తెలంగాణ ప్రాంతంలో తవ్విన చెరువులకు సరిహద్దులు నిర్ణయించే విషయంలో 60 ఏళ్లకు పైగా జరుగుతున్న జాప్యంతో.... ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురై.. ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్న తరహా వ్యవసాయానికి అనువుగా ఉన్న చెరువులు 556 ఉండగా , పంచాయతీరాజ్ పరిధిలో 4193 ఉన్నాయి. మొత్తం 4749 చెరువుల పరిధిలో 218945 ఎకరాల విస్తీర్ణంలో సమీప రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. 2016లో మిషన్ కాకతీయ పథకం కింద జిల్లాలోని చెరువులలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగేలా పూడికతీత పనులు చేపట్టారు. ఈ సమయంలో రికార్డుల ప్రకారం చెరువుల సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు ఉంటే తొలగించి ఎఫ్‌టీఎల్( నీటి నిల్వ సామర్థ్యం) మేర నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు దశల్లో మిషన్ కాకతీయ పనులు చేపట్టినప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే ఆక్రమణలు తొలగించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించిన హద్దులను కొందరు ఇప్పటికే తొలగించి తిరిగి పంటలు సాగు చేస్తున్నారు. రాజకీయ కారణాలతో గ్రామాల్లో ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల విభాగాల అధికారులు తొలగించలేని పరిస్థితి ఉండగా ఇప్పటికే పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఉ



మ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4749 చెరువుల్లో 90 శాతానికి పైగా చెరువులకు సరిహద్దులు గుర్తించలేదని నీటిపారుదల అధికారుల లెక్కలు చెబుతుండగా పరిస్థితి తీవ్రతను అర్థంచేసుకోవచ్చు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చర్యలు

అజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ సీఈ

చెరువుల ఎఫ్‌టీఎల్ సామర్థ్యం గుర్తించే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే నిర్ణీత విధానంలో సరిహద్దులు గుర్తిస్తాం. రికార్డుల ప్రకారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి నిర్ణీత హద్దులు ఏర్పాటు చేస్తాం.


ఆక్రమణలు మచ్చుకు కొన్ని...

మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద చెరువుకు రూ.9 కోట్లతో మినీట్యాంకు బండ్ నిర్మాణం జరపాలని 2016లో నిధులు విడుదల కాగా ఇప్పటి వరకు సరిహద్దు సమస్యతో పనులుఅసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమించుకోగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల సరిహద్దుప్రాంతంలోని రైతులు ముందుకు జరుగుతూ పంటలు సాగు చేస్తుండగా కొన్ని చోట్ల గతంలో రెవెన్యూ సిబ్బంది పట్టాలు సైతం ఇవ్వటంతో ప్రస్తుతం వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువుల సరిహద్దులు నిర్ణయించి ఆనవాళ్లు కోల్పోకుండా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

## అన్నదాతల బాధలు దేవుడెరుగు

మిర్యాలగూడ : కాలువల్లో పూడిక తీయకపోవడంతో సాగర్ ఆయకట్టు రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఉపాధిహామీ పథకం కింద అవకాశం కల్పించినా.. మున్సిపాలిటీల్లో కొన్ని గ్రామాలను విలీనం చేయడంతో ఉపాధి వర్తించని కారణంగా ప్రశ్నార్థకంగా మారింది. ఏటా యంత్రాలు, కూలీల సహాయంతో ఖర్చులు పెట్టుకొని రైతులు పూడిక తీయిస్తున్నారు. ఈసారి కూడా పూడిక తీయకపోవడంతో వాపోతున్నారు. లష్కర్లతో పనులు చేపడతామని అధికారులు చెబుతున్నప్పటికీ వారి కొరత కారణంగా పనులు సాగడం లేదు. మున్సిపాలిటీ పట్టణ ప్రాంతాల్లోని పంట కాలువలకు మురుగునీటి కాలువలు అనుసంధానం చేయడంతో వ్యర్థాలు చేరి దుర్వాసనతో పూడిక తీయడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ మురికి నీరు రాకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 మున్సిపాలిటీలలో సుమారు 45 విలీన గ్రామాల్లో వేలాది



ఎకరాలు సాగు చేస్తున్న రైతులకు ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రధానంగా ఎడమకాలువ పరిధిలో ఎక్కువ ఆయకట్టు గల హాలియా, నందికొండ, మిర్యాలగూడ, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేటతో పాటు నల్గొండ పురపాలికలలోని పంట కాలువల సమస్య అగమ్యగోచరంగా మారింది.

భారంగా మారింది

నలబోతు కొండలు, రైతు, ఇబ్రహీంపేట, హాలియా మున్సిపాలిటీ

హాలియా పట్టణంలోని పేరూరు మేజర్ ఎల్1 పంటకాలువ కింద సుమారు వెయ్యి ఎకరాలు సాగవుతోంది. వానాకాలం, యాసంగి సీజన్‌లో కాలువ పూడిక రైతులమే తీసుకుంటున్నాం. పట్టణంలోని వ్యర్థాలు కలవడం వలన కాలువ మురికి కూపంలా మారుతోంది. యంత్రాల సహాయంతో పూడిక తీయడం భారంగా ఉంది. మేజర్, మైనర్ పంటకాలువల పూడిక ప్రభుత్వమే చేపట్టాలి.

లష్కర్ల ద్వారా పనులు చేపడతాంఅజయ్‌కుమార్, చీఫ్ ఇంజినీరు, నల్గొండ జిల్లా, ఇరిగేషన్ శాఖఉపాధిహామీ పనులు అవకాశం లేని ప్రాంతాల్లో లష్కర్ల సహాయంతో పంటకాలువల పూడికతీత చేపడతాం. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. మున్సిపల్ ప్రాంతాల్లోని పంట కాలువల్లో మురుగునీటిని వదలడం, వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

# మనకు బోగీ భాగ్యం!

వరంగల్ : విద్యా కేంద్రంగా పేరున్న ఓరుగల్లు ఇక నుంచి పరిశ్రమలకు నిలయంగా మారనుంది. ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ రావాలని ఉద్యమాలు చేశారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్రజల వినతులు మన్నించి బోగీలను తయారు చేసే యూనిట్తోపాటు రైళ్ల సర్వీసు చేసే పీవోహెచ్ మంజూరు చేసింది. దీనికి శనివారం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ః ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పరిశ్రమగా ఇది నిలవనుంది. అనుబంధ పరిశ్రమలు రావడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇది సాంకేతికంగా అన్ని అంశాల్లో ముందు వరుసలో ఉంటుంది. ఉదాహరణకు కార్మికులకు రసాయనాల వల్ల హాని కలగకుండా బోగీలకు రోబో టెక్నాలజీతో రంగులు వేసే పరికరాలు ఇందులో ఉంటాయి. పరిశ్రమలో అనేక విభాగాలు ఉన్నాయి.. సిబ్బందికి పెద్ద క్యాంటీన్, సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన పార్కింగ్, సకల సౌకర్యాలు కల్పిస్తారు.

పరిశ్రమ నుంచి కాలుష్యం బయటకు రాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి ఈ ప్రాంతంలో ఎక్కువగా చెట్లు పెంచుతారు. ఇదంతా పచ్చగా ఉంటుంది.

పరిపాలనా విభాగం ఇక్కడే ఉంటుంది. ముఖ్య అధికారులు, ఉన్నతాధికారుల కోసం నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్. సకల సదుపాయాలు ఉంటాయి.

ఇవన్నీ రైలు పట్టాలు. కాజీపేట జంక్షన్ వరకు వీటిని అనుసంధానం చేస్తారు. వ్యాగన్లు తయారు చేశాక బోగీలను ఈ పట్టాల వెంట బయటకు తీసుకొచ్చి, కావాల్సిన చోటికి తరలిస్తారు.

ఈ నాలుగు భారీ షెడ్లలో అనేక కార్యశాలలు ఏర్పాటుచేస్తారు. వ్యాగన్‌ల బరువు కొలిచే వై బ్రిడ్జ్, బోగీలను తయారు చేసే కేంద్రం, చక్రాలను తయారుచేసేవి, విడిభాగాలన్నీ తయారయ్యాక బిగించే 'బాడీ



అసెంబ్లీ షాప్', రోబో సాంకేతికతతో మనుషులు లేకుండా బోగీలకు రంగులు వేసే పెయింట్ షాప్ అన్నీ వీటిల్లోనే ఏర్పాటుచేస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..కాజీపేట మండలం అయోధ్యపురంలో ఏర్పాటు చేయనున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ పలు ప్రత్యేకతల సమాహారం. ఆ వివరాలు.. తయారీ సంస్థ: భారతీయ రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ బాధ్యతలను రైల్వే నిగమ్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 24 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తారు. ఖర్చు: రూ.521 కోట్లు. పూర్తిగా నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వ్యయం మరింత పెరగవచ్చు.

అవసరం: ప్రస్తుతం దేశంలో 22,790 మెట్రిక్ టన్నుల సరకు రవాణాకు మాత్రమే వ్యాగన్‌లు ఉన్నాయి. మరో 7000 మెట్రిక్ టన్నుల సరుకు రవాణాకు ఇవి అవసరం. కాజీపేటలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమతో ఈ సమస్య తీరుతుంది.

ఉపాధి: మొదటి దశలో ఇతర ప్రాంతాల్లో పనిచేసే 1200 మంది రైల్వే ఉద్యోగులను బదిలీపై తీసుకు వస్తారు. పని పెరుగుతున్న కొద్దీ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రత్యేకంగా క్వార్టర్ల నిర్మాణం చేపడతారు.

పర్యావరణం: పరిశ్రమ కోసం నిర్మించిన షెడ్లకు గాజు గ్లాసులను అమర్చి సహజ వెలుగులను ఉపయోగించుకుని విద్యుత్తును ఆదా చేస్తారు.

సౌరవిద్యుత్తు: షెడ్లపైన సౌరఫలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.

ఆధునిక పరిజ్ఞానం: పరిశ్రమలో తయారైన వ్యాగన్‌లకు రోబోల ద్వారా రంగులు వేస్తారు.

లాభం: వ్యాగన్‌ల ఉత్పత్తి వల్ల రవాణా పెరిగి వ్యవసాయానికి ఊతం ఇస్తుంది. ఆన్సలరీ పరిశ్రమలు చుట్టుపక్కల వచ్చే అవకాశం ఉంది. సింగరేణి, సిమెంట్, ఎఫ్‌సీఐ పరిశ్రమలకు రవాణా కోసం త్వరగా రైళ్లను కేటాయించగలుగుతారు. కాజీపేటలో ఉద్యోగుల సంఖ్య పెరగడం వల్ల దీన్ని రైల్వే డివిజన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.

# సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేనా?

మెట్‌పల్లి : ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సిమెంట్ లైనింగ్ పలుచోట్ల దెబ్బతినడంతో పూర్తిస్థాయిలో నీరు విడుదల కాక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కాకతీయ కాలువ లైనింగ్ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. 2016లో కొంత మేర పనులు చేపట్టగా ఇటీవల మళ్లీ లైనింగ్ పనులు మొదలు పెట్టగా కాలువకు నీరు విడుదల చేసే సమయానికి పూర్తవుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై జిల్లాలో పలు గ్రామాలు సాగు, తాగునీటికి ఆధారపడ్డాయి. ఏళ్లుగా మరమ్మతులు జరగక పలు చోట్ల కాకతీయ కాలువ లైనింగ్ దెబ్బతింది. కాకతీయ కాలువ పూర్తి సామర్థ్యం 9600 క్యూసెక్కుల కాగా ఐదారు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేసే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వం లైనింగ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. 2016లో మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో రూ.28.72 కోట్లతో 4వ కిలోమీటర్ నుంచి 68.3 కిలోమీటర్ వరకు లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. పలు చోట్ల పనులు ప్రారంభించారు. వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేపట్టారు. కొంత మేర పూర్తి చేసిన తర్వాత మళ్లీ పనులు కొనసాగడంలేదు. ఇటీవల మండలంలోని రామారావుపల్లె శివారులో 47.160 నుంచి 50.130 కిలోమీటర్ వరకు రూ.7.60 కోట్లతో లైనింగ్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. కాలువకు నీరు విడుదల చేయకముందే పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నాణ్యత పాటిస్తేనే..లైనింగ్ పనులు హడావుడిగా కాకుండా నాణ్యతతో చేస్తేనే పదికాలాల పాటు మన్నికగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2016లో వర్షాలు కురిసే సమయంలో వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేశారు. కొంతకాలానికి వరద నీటికి పలుచోట్ల దెబ్బతింది. మే నెలలో చదును పనులు ప్రారంభించి ప్రస్తుతం సిమెంట్ లైనింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రాజెక్టులోకి నీరు చేరితే దిగువన కాకతీయ కాలువకు వదలాల్సి ఉంటుంది. నీరు వదిలితే పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఈ సారి చేరికలు అంతంతే..




ఖమ్మం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభమై నెల రోజులు దాటినా ప్రవేశాలు మాత్రం నత్తనడక సాగుతున్నాయి. కొన్ని కళాశాలల్లో చాలా స్వల్ప సంఖ్యలో విద్యార్థులు చేరటం విశేషం. గడువు (ఈనెల 20) సమీపిస్తున్నా ప్రవేశాలు ఊపందుకోకపోవడంతో మొదటి సంవత్సరం తక్కువ మంది విద్యార్థులతో తరగతులు వెలవెలబోతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

ఒకేసారి లాగిన్ ఇవ్వటంతో...

ఏటా ప్రవేశాల కోసం ప్రభుత్వ కళాశాలలకు ముందుగా లాగిన్ ఇచ్చి తర్వాత రెండు నెలలకు ప్రైవేటు కళాశాలలకు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు లాగిన్ సదుపాయం ఒకేసారి వచ్చింది. ఈసమయంలో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు మూల్యాంకనంలో నిమగ్నమై ఉండగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థుల హాల్ టికెట్లు తీసుకుని లాగిన్ చేశారు. దీని ప్రభావం ప్రవేశాలపై పడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ, మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటుచేయటంతో చాలామంది గ్రామీణ విద్యార్థులు అక్కడ చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బోధన సిబ్బంది కొరత..!

ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను గతేడాది అతిథి అధ్యాపకులతో భర్తీ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు అతిథి అధ్యాపకుల నియామకాలకు సంబంధించిన ఊసే లేదు. ఇంటర్ బోర్డు నుంచి అనుమతి రాకపోవటంతో ఖాళీలను భర్తీ చేయలేదు. గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రతి సంవత్సరం అతిథి అధ్యాపకులను కొనసాగిస్తుంటారు. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం నియామకాలకు సంబంధించి స్పష్టత లేక గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకునే వరకు సెప్టెంబరు, అక్టోబరు అవుతుంది. అందుకే విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరచటం లేదు.

మౌలిక వసతులు కరవు...

ప్రభుత్వ కళాశాలల్లో శౌచాలయాలు, తాగునీరు ఇతర సౌకర్యాల కోసం నిధులు మంజూరు కావడం లేదు. ఇటీవల ఉభయ జిల్లాల్లోని అన్ని కళాశాలల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయనే విషయం గురించి న్యాయమూర్తులు సందర్శించి నివేదికలు అందజేశారు. కళాశాలల్లో స్కావెంజర్లు, స్వీపర్లు లేరు.ప్రభుత్వ కళాశాలల్లో ప్రస్తుతం ప్రవేశాలు తక్కువగా ఉన్నాయి. వీటిని పెంచేందుకు కృషి చేస్తాం. గురుకుల జూనియర్ కళాశాలల ప్రభావం ప్రవేశాలపై పడింది. ఈనెల 25 వరకు గడువు ఉన్నందున చేరికల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నాం.

కె.రవిబాబు, డీఐఈఓ, ఖమ్మం

# ఇన్‌ఛార్జిల పురంపర..!




ఖమ్మం : బల్దియాల్లో అధికారుల కొరత వేధిస్తోంది. ఒక్కొక్కరు రెండు, మూడు చోట్ల అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుండటంతో పాలన కుంటుపడుతోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా ప్రధాన విభాగాలనూ ఇన్‌ఛార్జిలే పర్యవేక్షిస్తున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చినవారు కొన్ని విభాగాల్లో విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. పట్టణాల్లో కొన్ని సమస్యలు నెలలు తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అక్కడా.. ఇక్కడా..సత్తుపల్లి పుర శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ ఏడాది క్రితం బదిలీ కాగా నాటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అవుట్ సోర్సింగ్ విధానం ద్వారా ఒకరిని నియమించి పనిచేయిస్తున్నారు. జూనియర్ అకౌంటెంట్ స్వప్న వైరా మున్సిపాలిటీలోనూ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వారానికి రెండు రోజుల చొప్పున అక్కడా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత జనాభాకు 136 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం. 97 మంది మాత్రమే పనిచేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇద్దరంటే ఇద్దరే

మధిర పురపాలికలో మేనేజర్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. కమిషనర్ నుంచి పట్టణ ప్రణాళికా అధికారి, శానిటరీ పర్యవేక్షకులు, మెప్మా ఏపీఎం, పురపాలక ఏఈ వంటి ప్రధాన పోస్టులకు ఇన్‌ఛార్జి అధికారులే దిక్కు. ఇటీవల ఎనిమిది మంది వీఆర్‌ఓలను ఇంటి పన్నుల వసూలుకు నియమించారు. సిబ్బంది కొరతతో పౌరసేవల్లో జాప్యం జరుగుతోంది. ఈవిషయంపై మధిర పుర కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ ఖాళీ పోస్టుల వివరాలను పాలకవర్గం ద్వారా ప్రభుత్వానికి నివేదించామన్నారు.

సేవలు అంతంతే

వైరా పురపాలికగా ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా కీలక పోస్టులకు ఇన్‌ఛార్జులే కొనసాగుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి పోస్టును ఆరంభం నుంచి భర్తీ చేయటం లేదు. ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చే కీలకమైన పోస్టులో రెగ్యులర్ అధికారి లేరు. ఖమ్మం కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారి ఇక్కడ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. వారానికి రెండురోజులు వచ్చివెళ్తున్నారు. నిర్మాణ అనుమతులతో పాటు ఇతర పనులు కుంటుపడుతున్నాయి. అకౌంటెంట్‌గానూ ఇన్‌ఛార్జి అధికారి పనిచేస్తున్నారు. సత్తుపల్లిలో విధులు నిర్వర్తించే ఈ అధికారి.. వైరాకు వారానికి ఒకట్రెండు రోజులు మాత్రమే వస్తున్నారు. కీలకమైన ఆర్థిక వనరులు చూసే పోస్టుకూ రెగ్యులర్ అధికారి లేరు. ఇక్కడ మేనేజర్ పోస్టులో నియమితులైన మరో అధికారి మధిర కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వరకు తాత్కాలిక కమిషనర్లు విధులు నిర్వర్తించారు. నెల క్రితం నూతన అధికారి వచ్చినా ఆయన పోస్టు స్థానికంగా మంజూరు కాలేదు. జనరల్ ఫండ్ నుంచి వేతనం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# భక్తులు మెచ్చేలా.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..!

భద్రాచలం : భద్రాచలం రామాలయ దర్శనానికి వచ్చే భక్తులకు సదుపాయాలు మెరుగపరచాలని అధికారులు సంకల్పించారు. ఇప్పటికే ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇవి పూర్తయితే ఈ దివ్యక్షేత్ర శోభ మరింత పెరగనుంది. ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్ణశాల అభివృద్ధికీ ఆస్కారం ఏర్పడింది. ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) కార్యక్రమం కింద రూ.92.04కోట్లు అవసరమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రతిపాదించగా తొలి విడతలో రూ.41.38 కోట్లు మంజూరయ్యాయి. ఈపనులకు సంబంధించిన శిలాఫలకాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము గతేడాది డిసెంబరులో వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

ప్రస్తుతం జరుగుతున్న పనులు..

రామాలయ పరిసరాల్లో రెండెకరాల స్థలాన్ని పర్యాటక విభాగానికి రెవెన్యూ శాఖ అప్పగించింది. ఇక్కడ జీ౦1 పద్ధతిలో అధునాతన హంగులతో భవన నిర్మాణానికి పునాదులు తవ్వారు. ఇక్కడ విశాలమైన గదులు, ప్రసాదాల కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, పార్కింగ్ స్థలం, రెండువైపులా ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ కంట్రోల్ విభాగం, విరాట మండపం, డైనింగ్ హాల్, కేశఖండన శాల, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రథమ చికిత్స విభాగం, క్లాక్ రూం, ఫలహార శాల, గ్రంథాలయం నిర్మించనున్నారు. పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వనున్నారు.

చేపట్టాల్సినవి..

రెవెన్యూ అతిథిగృహం నుంచి కరకట్ట కిందిభాగం గుండా పర్యాటక విభాగం చేపట్టిన పనుల వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు. షెల్టర్లు ఏర్పాటుచేసి యాత్రికులు సేద తీరేందుకు బల్లలు సమకూర్చనున్నారు. హరిత హోటల్ నుంచి రామాలయం వరకు ఇదే తరహా ఏర్పాట్లు చేస్తారు. ప్రధానాలయం వద్ద మాడవీధుల విస్తరణ, విద్యుద్దీపాలు, వ్రత మండపం, రూఫింగ్, ఫ్లోరింగ్, బారికేడ్ల



నిర్మాణానికి నిధులు కేటాయించారు. బ్యాటరీ ద్వారా నడిచే కార్లను తిప్పనున్నారు. కోవెల పరిసరాల్లో అప్రోచ్ దారులు, శిల్ప కళా సౌందర్యం ఉట్టిపడేలా స్వాగత ద్వారాలు, నడక మార్గానికి అందాన్నిచ్చే లైటింగ్, కరకట్ట వైపు బయో టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే సదుపాయం, నదీ విహార ఏర్పాట్లు చేయనున్నారు. పట్టణ ప్రవేశం వద్ద సీసీ టీవీ వ్యవస్థ, స్వాగత ద్వారం ఉండనున్నాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల సమీపంలోని సీతవాగు వద్ద విద్యుద్దీపాలు, క్యూలైన్లు, ఫ్లోరింగ్, బయో టాయిలెట్లు నిర్మిస్తారు. గోదావరిలో బోట్ షికారు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, దుకాణాలు, షెల్టర్లను ఏర్పాటు చేయనున్నారు. భద్రాచలం, పర్ణశాలలో సిగ్నల్ లైట్లు, సమాచార బోర్డులు అమర్చనున్నారు. ఎంపిక చేసిన చోట సౌరశక్తిని ఉపయోగిస్తారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి పర్యాటకులను ఆకట్టుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

# బినామీలదే అధికం

జగిత్యాల : రోడ్డు పక్కన చిన్నాచితకా వ్యాపారాలతో వీధివ్యాపారులు ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. మరోవైపు వీరి కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు సైతం పెరగడంతో వీధివ్యాపారులకు శాశ్వత షెడ్ల సౌకర్యం కల్పించాలని పురపాలక శాఖ భావించింది. ఇందుకు సౌలభ్యంగా ఉన్న రహదారుల్లో బల్దియా రెండేళ్ల క్రితం షెడ్ల నిర్మాణం చేపట్టింది. పట్టణంలో గొల్లపల్లిరోడ్డు వైపు 37 దుకాణాలు, శ్రీరామా థియేటర్ ఎదుట 9, అంగడిబజార్‌లో 20 షెడ్లను రూ.45 లక్షలతో నిర్మిస్తోంది. ఒక్కో పనిని రూ.15 లక్షల చొప్పున విభజించి గుత్తేదార్లకు అప్పగించారు. గొల్లపల్లి రోడ్డువైపు షెడ్లకు ఏడాదిన్నరపైనే పట్టింది. రామా థియేటర్, అంగడిబజార్‌లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో తీవ్రమైన జాప్యంతో పాటు నాణ్యత లోపించిందని వీధివ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాకేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టిన సర్వేలో మొత్తం 6207 వీధి వ్యాపారులున్నారు. ఇందులో ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకేచోట రహదారులపై చిరువ్యాపారులు చేసేవారు 300పైనే ఉంటారు. నిర్మించిన షెడ్లు 100 లోపే ఉన్నాయి. గొల్లపల్లిరోడ్డులో గతంలో ఉన్నవారికే ప్రాధాన్యతనిచ్చి కేటాయింపులు చేపడతామన్న అధికారులు గుట్టుచప్పుడు కాకుండా 29 షెడ్లను అప్పజెప్పారు. మిగిలినవాటిని సైతం అక్రమ పద్ధతిలో కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంజూరు చేసిన షెడ్లలో యజమానులు నిర్వహించకుండా వాటిని కొందరు నిబంధనలకు



విరుద్ధంగా అద్దెకు ఇస్తున్నారు. వీటిపై పురపాలక, మెప్మా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంలేదు. దీంతో అర్హులకు అందాల్సిన షెడ్లు ఆరంభంలోనే ఇతరులకు చిక్కడంతో మిగిలినవాటిపై కూడా దళారులు కన్నేశారు. షెడ్ల కేటాయింపులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు అధికారులతో కుమ్మక్కై అర్హులకు మొండిచేయి చూపారు.

రోడ్డుపైనే అమ్మకాలు

జిల్లాకేంద్రంలో అవసరం మేరకు షెడ్ల నిర్మాణానికి స్థలమున్నప్పటికీ కేవలం కొన్నిచోట్లనే నిర్మించారు. గుర్తింపుకార్డు కలిగిన వీధివ్యాపారులు వందల సంఖ్యలో రోడ్లపైనే నిత్యం ఎండకు, వానకు తామున్నచోటనే కష్టాలు అనుభవిస్తున్నారు. యావర్‌రోడ్డులో కేవలం గద్దెలు నిర్మించి వదిలేశారు. పార్కు వద్ద సౌకర్యంగా ఉన్నా ఇక్కడ షెడ్లు నిర్మించలేదు. పాతబస్టాండు కూడలి, జంబిగద్దె, యావర్‌రోడ్డు, కొత్తబస్టాండు కూడలి తదితర ప్రాంతాల్లో నిత్యం వీధివ్యాపారులు తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఇలాంటివారికి మెప్మా, పురపాలక సంఘం అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి భరోసా కల్పించలేకపోయారు. కనీసం షెడ్లకు సంబంధించి పూర్తి అవగాహన సైతం వీధి వ్యాపారులకు కల్పించలేకపోయారు. కనీసం త్వరలో కేటాయించనున్న షెడ్లనైనా గుర్తింపుకార్డు కలిగిన అర్హులకు కేటాయించాలని వీధివ్యాపారులు కోరుతున్నారు.

అక్రమాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు

శ్రీనివాస్, మెప్మా అధికారి

పట్టణంలో షెడ్ల కేటాయింపులో అర్హులకే అవకాశం కల్పించాం. యజమానులు కాకుండా ఇతరులు షెడ్లలో ఉండేందుకు అవకాశం లేదు. ఎవరైనా ఉంటే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే అన్ని షెడ్లను నిబంధనల మేరకు కేటాయిస్తాం.

# వరంగల్ రహదారికి మహర్దశ

కరీంనగర్ : ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. కరీంనగర్–వరంగల్ రహదారికి మహర్దశ రానుంది. 563వ నంబరు జాతీయ రహదారి నాలుగు వరుసలుగా మార్చే పనులు ప్రారంభించేందుకు ఈనెల 8న ప్రధాని నరేంద్రమోదీ వరంగల్‌కు వస్తున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతోపాటు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి వినతులు అందించారు. ఆరు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డు కోసం రూ.2,146 కోట్లు విడుదల చేసింది. అప్పటినుంచి భూసేకరణ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. దాదాపు 60 శాతానికిపైగా ప్రక్రియ పూర్తికాగా సంబంధిత భూనిర్వాసితులకు రైతులకు పరిహారం అందుతోంది.

ప్రమాదాలకు అడ్డుకట్ట..

కరీంనగర్–వరంగల్ రహదారికి అధిక ప్రమాదాలు జరిగే మార్గంగా పేరొందింది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయి. ఎందరో ప్రాణాలు కోల్పోగా.. చాలామంది క్షతగాత్రులయ్యారు. అధిక మూలమలుపులు ఉన్న రోడ్డు ఇది. ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా అడ్డుకట్ట పడలేదు. రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటం వేలాది వాహనాలు రాకపోకలను సాగిస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సగటున నెలకు 40కిపైగా ప్రమాదాలు జరిగే ఈ మార్గాన్ని విస్తరించాలనే ప్రతిపాదనకు సర్కారు ఆమోదించింది. కరీంనగర్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 30 గ్రామాలకు ఈ దారి విస్తరణతో మేలు జరగనుంది. కరీంనగర్ జిల్లా పరిధిలో 46.24 కి.మీ, హనుమకొండ జిల్లా పరిధిలో 21.77 కి.మీ కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నారు. పాత రోడ్డు 66.79 హెక్టార్లలో ఉండగా కొత్తగా 258.33 హెక్టార్లు సేకరిస్తున్నారు. మొత్తం నాలుగు వరుసల రహదారికి ఏకంగా 325.12 హెక్టార్ల భూమిని వినియోగించనున్నారు.

ఐదు బాహ్య వలయదారులు..

మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి సమీపంలో ఐదు బైపాస్‌లు నిర్మించనున్నారు. మొత్తం రోడ్డులో దాదాపు 45 కి.మీ మేర ఈ బాహ్యవలయ రహదారి ఏర్పాటుకానుంది. ఈ మార్గాన్ని 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో నిర్మించబోతున్నారు. ఈ మార్గం వెంబడి అధునాతన వసతులు కల్పించనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు రోడ్డు పక్కన నిలిపేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్గాన్ని తొందరగా పూర్తి చేస్తే ప్రయాణం మరింత సులభతరమవుతుంది. రెండు చోట్ల ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి)లు నిర్మించనున్నారు. కల్వర్టులు చిన్నపాటి వంతెనలు పలు చోట్ల ఏర్పాటు చేయబోతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో ఈ రోడ్డును పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.

# అవినీతి చిట్టా.. రూ. 50 లక్షలిస్తే పట్టా



ఆసిఫాబాద్ : ఆయనో ఉన్నతాధికారి. చేయితడిపితే చాలు ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ భూమి అని చూడకుండా పట్టా చేస్తాడు. చేష్టలుడిగిన జిల్లా యంత్రాంగాన్ని తనకు అనుకూలంగా మలచుకొని అవినీతిలో మునిగితేలుతున్నాడు. ఓ నియోజకవర్గ నేత అండదండలు పుష్కలంగా ఉండటంతోపాటు ఒకరకంగా ఆయనకు బినామీగా చలామణి అవుతూ లెక్కలేనన్నీ అక్రమాలకు పాల్పడుతున్నారు. అనేక ఆధారాలతో సహా ప్రజలు, కొందరు నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, తనపై ఈగ వాలకుండా సదరు నేత సాయంతో అన్ని చక్కపెట్టుకుంటున్నాడు. ఈయన ఎక్కడ పనిచేసినా అక్కడ భారీ స్థాయిలో భూములు కొనుగోలు చేయడం, (ప్రభుత్వ స్థలాన్నే ఇతరులకు పట్టా చేసి, అదే ఆక్రమించుకోవడం) భారీ భవంతి కట్టడం కొనసాగిస్తున్నాడు. తాజాగా సదరు అధికారి రూ. 50 లక్షలకు బేరసారాలకు దిగిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆసిఫాబాద్ పట్టణంలో ప్రస్తుత కేబీ థియేటర్ వెనుక ఎకరంన్నర ఆబాదీ ప్రభుత్వ భూమి ఉంది. వాస్తవానికి అక్కడ 15 ఎకరాల వరకు ఆబాదీ భూములు ఉండాలి. అంతా అన్యాక్రాంతమైపోయి కేవలం 1.30 ఎకరం మాత్రమే మిగిలింది. సదరు అధికారి సైతం ఈ స్థలంలోనే ఇల్లు కట్టుకోవడం గమనార్హం. ఓ ద్వితీయ శ్రేణి నేత దాదాపు ఎకరం వరకు ఆక్రమించుకుని అయిదేళ్ల క్రితమే ఇంటి నిర్మాణం చేపట్టగా, ఇటీవలే భారీ షట్టర్ గదులు పది వరకు నిర్మించారు. మిగిలి ఉన్న ఎకరంన్నర భూమిని సైతం ఈ నేత పట్టా చేసుకోవడానికి అధికారిని సంప్రదించారు.

ఆడియోలో ఏముందంటే..మిగిలి ఉన్న 1.30 ఎకరాల భూమిని అధికారి, ఓ నేత, మధ్యవర్తి ఓ బిల్డర్‌తో బేరసారాలకు దిగినట్లుగా ఆడియోలో ఉంది.

నేత: సార్ 1.50 కోట్లకు మనం స్థలం ఇస్తామని అన్నాం. చివరికి వారు రూ. 1.30 కోట్లకు ఫైనల్ చేశారు.

అధికారి: రూ. 1 కోటి వరకు వస్తాయి కావచ్చు. ఇందులో రెండు భాగాలు చేద్దాం. ఒక భాగం నాకు. మరో భాగం రెండుగా విభజించి పంచుదాం.

నేత: నాకు అర్థం కాలేదు సార్!!

అధికారి: ఉదాహరణకు రూ.కోటి వస్తే ఇందులో ఇద్దరం రూ. 50 లక్షలు, రూ. 50 లక్షలు తీసుకుందాం. ఇంకో మధ్యవర్తి నాకు వచ్చిన దాంట్లో కూడా రూ. 12.50 లక్షలు ఇవ్వాలని అంటున్నాడు. అయనకు మనం ఎందుకు ఇవ్వాలి.

నేత: జిల్లా అధికారులందరూ డబ్బులు అందివ్వాలని (మధ్యవర్తి- బాబాపూర్ వ్యక్తి) అంటున్నాడు.

అధికారి: అదంతా ఏం లేదు. మనల్ని దాటి ఎవరూ ముందుకు పోలేదు. ఇక్కడ ఎకరం 1.50 కోట్ల వరకు ఉంటుంది.

నేత: అవును సార్ మధ్యవర్తి, బిల్డర్ నా దగ్గరకు వచ్చారు.

ఈ విధంగా సుమారు ఎనిమిది నిమిషాల పాటు సాగిన సంభాషణ జిల్లా రెవెన్యూ వ్యవస్థలో వెళ్లానుకున్న అక్రమాలను బహిర్గతం చేస్తోంది. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారి ఆధ్వర్యంలో జిల్లాలో వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. ప్రభుత్వ భూములకు పట్టాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆడియోలో ఉన్న సదరు నేత నిర్మించినవి సైతం ప్రభుత్వ భూములే కావడం గమనార్హం. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. ఇక్కడ నిర్మాణాలు ఏలా చేశారని రెవెన్యూ అధికారులు సైతం నోటీసులు ఇచ్చారు. జిల్లాలో కొనసాగుతున్న భూ పందేరాలను నిలువరించడానికి ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

## బోధనాస్పత్రుల్లో సీనియర్ రెసిడెంట్లు


గోదావరిఖని : వైద్య విద్యలో పీజీ పూర్తి చేసిన తర్వాత తప్పనిసరిగా ఏడాది పాటు సీనియర్ రెసిడెంట్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాల్సి ఉన్న నేపథ్యంలో వైద్య సేవలు మెరుగుపడే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 26 వైద్య కళాశాలలకు అనుబంధంగానున్న బోధనాస్పత్రుల్లో సీనియర్ రెసిడెంట్లు(ఎస్.ఆర్.)గా పనిచేసేందుకు 389 మందికి విధులు కేటాయించారు. కౌన్సిలింగ్ విధానంలో సీనియర్ రెసిడెంట్లు ఆస్పత్రులను ఎంచుకోనుండగా నియామక ప్రక్రియ పూర్తికావడంతో త్వరలోనే వారు ఆయా ఆస్పత్రుల్లో విధుల్లో చేరి వైద్య సేవలందించాల్సి ఉంది. ప్రస్తుతం సైతం పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీనియర్ రెసిడెంట్లుగా పనిచేస్తున్న వారి గడువు ముగియనుండగా గత విద్యా సంవత్సరంలో వైద్యవిద్యలో పీజీ పూర్తి చేసుకున్న వారు సీనియర్ రెసిడెంట్లుగా తాజాగా విధుల్లో చేరనున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో వివిధ ప్రత్యేక విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో ప్రజలకు సేవలు దూరం కాగా ఆయా విభాగాల్లో సీనియర్ రెసిడెంట్లు



విధుల్లో చేరనుండడంతో ప్రత్యేక వైద్య సేవలు సైతం ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. గతేడాది కేవలం కొత్తగా ఏర్పాటుకానున్న వైద్య కళాశాలలకు సంబంధించిన బోధనాస్పత్రుల్లో పనిచేసేందుకు మాత్రమే సీనియర్ రెసిడెంట్లకు అవకాశమివ్వగా ఈ సారి గాంధీ, ఉస్మానియా, కాకతీయ వైద్య కళాశాలలకు అనుబంధ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు అవకాశమిచ్చారు. దీనిలో భాగంగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆస్పత్రికి 37 మంది స్మీనియర్ రెసిడెంట్లు రానుండగా ఇందులో జనరల్ సర్జరీ, ఫిజియాలజీ, సైకియాట్రిస్టు, రెస్పిరేషన్ మెడిసిన్ తదితర పలు ప్రత్యేక విభాగాలకు చెందిన సీనియర్ రెసిడెంట్లు ఉన్నారు.

## పరిహారమేది?

సిరిసిల్ల: శ్రీరాంసాగర్ రెండో దశలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలకు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు బోయినపల్లి మండలం మన్వాడ వద్ద 2006లో రాజరాజేశ్వర జలాశయం పనులు ప్రారంభమయ్యాయి. అంతకు రెండేళ్ల ముందు నుంచే సర్వే, భూ సేకరణ ప్రక్రియ జరిగింది. దీనికి జిల్లాలోని వేములవాడ, బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండల ప్రజలు భారీ మూల్యం చెల్లించుకున్నారు. 11 గ్రామాల్లో 20 వేల ఎకరాలు, 12 వేలకు పైగా కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. అప్పట్లో పరిహారం, పునరావాసంతోపాటు యువతకు ఉపాధి అంటూ ఎన్నికలొచ్చిన ప్రతిసారి హామీల వర్షం కురిపించారు. ఏళ్ల తరబడినా అమలు కావడం లేదు. తాజాగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులంతా ఏకమయ్యారు. సోమవారం నిర్వాసితుల నిరసనలతో వారి సమస్యలు మరోసారి తెరపైకి వచ్చాయి. పరిష్కరించాల్సినవి ఇవీ... 2021 జులై 4న ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ఒక రోజు ముందు 11 గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు రూ. 2 లక్షల చొప్పున 701 మందికి ప్రభుత్వం రూ. 13.70 కోట్లు విడుదల చేసింది. 2,068 మందిని మొదట్లోనే గుర్తించారు. వీరిలో 1,009 మందికి పలు విడతల్లో చెల్లింపులు జరిగాయి. గ్రామాల వారీగా అర్హులైన వారిపై పలు విడతల్లో తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతో విచారణ చేయించారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో 72 మందిని అర్హులుగా గుర్తించి నివేదిక పంపగా జాబితాలో 14 మంది పేర్లు మాత్రం రావడంతో మిగతా వారు ఆందోళనలో ఉన్నారు. మిగతా గ్రామాల్లోనూ ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొంది. గెజిట్ జాబితాలో పేర్లు తప్పిపోయిన యువతులు దరఖాస్తు చేసుకోగా విచారణలో అర్హులుగా గుర్తించిన అధికారులు ఎస్‌కేఎస్ (సమగ్ర కుటుంబ సర్వే) వివరాల్లో చూసి పక్కన పెట్టారనే విమర్శలున్నాయి. సర్వే సమయంలో నిర్వాసితులు చేస్తున్న వృత్తి నమోదులో తప్పులు దొర్లాయి. చదువుకుంటున్న వారు మధ్యలో



మానేసినా జాబితాలో నేటికీ విద్యార్థిగానే చూపుతోంది. ఇప్పటికీ చాలా సార్లు ప్రభుత్వం సవరణలకు అవకాశం ఇచ్చింది. అయినా జాబితాలో మార్పు జరగలేదు. నేటికీ నిర్వాసిత గ్రామాల్లోని వారు వృత్తి మార్పు సమస్యను ఎదుర్కొంటున్నారు.

కుటుంబ పరిహారం ప్యాకేజీలో 365 రోజులకు రూ. 175 చొప్పున చెల్లించగా శెభాష్‌పల్లిలో మాత్రం రూ. 100 చొప్పున చెల్లించారు. వీరంతా జులైలో కలెక్టరేట్కు తరలివచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. గెజిట్ జాబితాలో పేర్లు వచ్చిన నిర్వాసితులు పరిహారం తీసుకోక ముందే మృతి చెందారు. వారికి సంబంధించిన ఇంటి స్థలం పట్టా, పరిహారం వారసులకు, కుటుంబ సభ్యులకు అందలేదు. ఇంటి స్థలాలు, తప్పిపోయిన ఇళ్లు (నాన్‌నోటిఫైడ్) వాటికి, అసైన్డ్ భూములకు సంబంధించిన పరిహారం అందలేదు.

నిర్వాసిత గ్రామాల్లో 2006లో గెజిట్ పబ్లికేషన్ ఆధారంగా గుర్తించిన యువతకు స్వయం ఉపాధి, పరిశ్రమల స్థాపన వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. వీటిపై గ్రామాల వారీగా సర్వేలు కూడా జరిగాయి. నేటికీ ఉపాధి కల్పించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

**గెజిట్ ఉత్తర్వులనే మార్చేశారు**
**- నాంపెల్లి శ్రీలత, వరదవెల్లి, బోయినపల్లి మండలం**

ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ఉత్తర్వుల్లో పేరుంది. పదో తరగతి మెమోను సమర్పించడంలో జాప్యం జరిగింది. అప్పటికే పరిహారం అందించారు. అధికారులను సంప్రదించగా రెండో జాబితాలో వస్తుందన్నారు. తర్వాత గ్రామంలో సర్వే చేసి 72 మంది యువతుల పేర్లతో నివేదిక పంపారు. మూణ్నెళ్ల క్రితం వచ్చిన ప్రత్యేకాధికారి ఆ జాబితా మా వద్ద లేదంటున్నారు. ఇన్ని రోజులు వేచిచూస్తే తీరా పేరులేదంటూ అధికారులు తప్పించుకుంటున్నారు.

## కలుపు తీతకు కాడెద్దుల భారం



ఆసిఫాబాద్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏ చేనులో చూసినా మొక్కలను మించి కలుపు పెరిగింది. లోతట్టు ప్రాంతాల పంటలు పూర్తిగా కొట్టుకుపోగా.. మైదాన ప్రాంతాల్లో ఉన్న వాటిని బతికించుకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. పత్తి చేన్లలో కలుపుతీత కోసం వినియోగించే కాడెద్దులు రైతులకు భారమయ్యాయి. యాంత్రీకరణ పెరిగి, కష్టమై పశుసంతతి ఏటికేడు తగ్గుతుండగా.. ఇటీవల పిడుగుపాటుకు వందల సంఖ్యలో ఎద్దులు మరణించాయి. ఈ నేపథ్యంలో కాడెద్దులకు భారీగా డిమాండ్ పెరిగింది. జిల్లాలో వీటి అద్దె ఒకరోజుకు రూ. 1500 వరకు పలుకుతుండటం గమనార్హం.

వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అన్నదాతలు చేన్ల పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో వర్షాలు ఇప్పటికీ అడపాదడపా పడుతూనే ఉన్నాయి. దీనికితోడు ప్రాణహిత వరదలు పంటలను ముంచెత్తాయి. చేనులో నీరు తగ్గడంతో కలుపుతీతపై కర్షకులు దృష్టి సారించారు. కలుపు నివారణకు పత్తి సాళ్ల మధ్య దౌర కొడతారు. వీటికి కాడెద్దులు తప్పనిసరి. యంత్రాల ద్వారా దున్ని విత్తుకున్నవారు ఇప్పుడు ఎద్దులు లేక అవస్థలు పడుతున్నారు. ఎడ్ల జత ఉన్నవారు వారి పనులు అయ్యాకే అద్దెకు ఇస్తుండటంతో మిగిలిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కొంతమందే అద్దెకు ఇస్తుండగా.. రోజుకు అద్దె రూ. 1500 వరకు పలుకుతోంది. ముందుగా అడ్వాన్సు చెల్లించాల్సి వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒకరోజులో మూడు నుంచి నాలుగు ఎకరాలు దౌర కొట్టినా.. అన్నదాతలకు తీవ్ర ఆర్థికభారం పడుతుంది. మొక్క ఎదిగే వరకు కనీసం మూడు నుంచి నాలుగుసార్లు దౌర కొట్టాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ లెక్కన అయిదెకరాలు ఉన్న రైతు కనీసం రూ. 6 నుంచి రూ. 7 వేలు వెచ్చించాల్సి వస్తోంది. పెరిగిన ఎరువులు, విత్తన ధరలకు తోడు కాడెద్దులు కూడా భారమయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ ద్వారా ఎడ్ల జతలు ఇప్పించాలని కోరుతున్నారు.

**ఐటీడీఏ ద్వారా ఆదుకోవాలి..- జాదవ్ సత్యపాల్, లింగాపూర్**

నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మొదట ట్రాక్టర్ ద్వారా భూమి చదును చేసి విత్తనాలు వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో కలుపు భారీగా పెరిగిపోయింది. ఎడ్ల జతలు లేకపోవడంతో రోజుకు రూ. 1500 అద్దెతో కాడెద్దులు తీసుకువచ్చా. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎడ్ల జతలు ఇప్పించి ఆదుకోవాలి.

**రసాయన మందులు కొనే స్థోమత లేదు- చోలే బాలాజీ, జామ్ని**

కాడెద్దులు ఉన్న వారికి ఒక రోజు ముందే అడ్వాన్సులు ఇచ్చేస్తున్నారు. ఏకధాటిగా కురిసిన వర్షాలకు కలుపు తీవ్రంగా పెరిగింది. రసాయన మందులు కొనే స్థోమత లేదు. ఇప్పుడు దౌర కొట్టడానికి కూడా అంతే ఖర్చు అవుతుంది. కానీ మందులు కొడితే మొక్కలు కూడా చనిపోయే ప్రమాదం ఉంది.

## కు.ని.. జాగ్రత్త సుమీ..!

మంచిర్యాల : కు.ని (కుటుంబ నియంత్రణ) శస్త్రచికిత్సలు వికటించి ఇద్దరు మహిళలు మృతిచెందడం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఈ చికిత్సలపై మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకునే పరిస్థితితో పాటు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలో సైతం ఏటా వేలల్లో జరుగుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి ఎదురుకాలేదని వైద్యునిపుణులు చెబుతున్నారు. చికిత్స చేసే సమయంలో ప్రత్యేక నిబంధనలు పాటిస్తున్నామని, ఒక్కరోజులోనే పదులకొద్ది కాకుండా విడతల వారీగా జరిపిస్తున్నామని తెలుపుతున్నారు. జిల్లాలో కు.ని చికిత్సలు చేసుకున్నవారికి ఏ సమస్య లేకపోయినా నిత్యం నిర్వహించకపోవడమే ఇబ్బందిగా మారింది. ట్యూబెక్టమీకి వైద్యులు అందుబాటులో ఉన్నా వేసెక్టమీలు చేసేందుకు ఒక్కరూ లేరు. దీంతో అవగాహన లోపంతో చేసుకునేందుకు పురుషులు రాకపోవడం, చేసేందుకు వైద్యుడు లేకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

**కోతలేని చికిత్సకు మొగ్గుచూపాలి**

జిల్లాలో ఈ కోతలేని చికిత్స (వేసెక్టమీ)కు ప్రస్తుతం ఒక్క వైద్యుడు అందుబాటులో లేరు. మొన్నటి వరకు డా.సుబ్బారాయుడు వీటిని చేశారు. ప్రస్తుత జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తుండంతో పనిభారం ఎక్కువైంది. వైద్యారోగ్యశాఖ పూర్తి కార్యకలాపాలు ఈయనే చూసుకుంటుండటంతో ఆయా సేవలపై దృష్టిసారించడం కష్టంగా మారింది. జీజీహెచ్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళా వైద్యురాళ్లు ఉండటంతో ట్యూబెక్టమీ (మహిళకు సంబంధించిన చికిత్స)కు ఎలాంటి ఇబ్బంది కలగడంలేదు. సంబంధిత కుటుంబ నియంత్రణ చికిత్సకు ముందుకొచ్చేవారికి ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. కుట్టు, కోతలేని వేసెక్టమీ చికిత్సకు గతంలో ఆసక్తి చూపించడం చాలా అరుదుగా కనిపించేది. నిమిషాల్లో పూర్తికావడంతో పాటు మరుసటిరోజు నుంచే యథావిధిగా తమ పనులు చేసుకునే అవకాశం ఉండటంతో అవగాహతో పలువురు ముందుకొస్తున్నారు. కానీ ఆచరణలో పెట్టడంలో ఆరోగ్యశాఖ విఫలమవుతోంది. ఈ లెక్కలు చూస్తే తెలుస్తోంది.. జిల్లాలో కోతలేని చికిత్సలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో. ట్యూబెక్టమీ వేలల్లో ఉంటే ఇందులో ఒక్క శాతం కూడా వేసెక్టమీ చికిత్సలు జరగడంలేదు. వీటికి పురుషులు ముందుకు రాకపోవడం ఒక కారణమైతే.. వైద్యారోగ్యశాఖ ప్రచారం చేయకపోవడం మరో కారణం.

**కు.ని చికిత్సలపై దృష్టిసారిస్తున్నాం**
**డా.సుబ్బారాయుడు, జిల్లా వైద్యాధికారి**

కుటుంబ నియంత్రణ చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జిల్లా కేంద్రంతో పాటు లక్షెటిపేట, చెన్నూరు, బెల్లంపల్లిలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ శస్త్రచికిత్సలు నిర్వహించడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. వైద్యుల కొరత కారణంగా వేసెక్టమీ సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం ఉన్న వైద్యులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపడతాం. కోతలేని ఈ చికిత్సకు పురుషులు ముందుకురావాలి.

## అధికారుల నిర్లక్ష్యం... పనుల్లో జాప్యం

సిరిసిల్ల: వాగులు, కాల్వల ప్రాంతంలో లో లెవల్ కల్వర్టులు. తక్కువ ఎత్తులోని కాజ్‌వేలతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలకు కల్వర్టులపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాకాలంలోనైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. కల్వర్టులు నీట మునుగుతుండగా వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యను తీర్చేందుకు కాజ్‌వేల స్థానంలో వారధులు నిర్మించాలని సర్కారు భావించింది. అందుకు రూ కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న గుత్తేదారు అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. బ్రిడ్జిల నిర్మాణ ప్రాంతాల్లో వేస్తున్న తాత్కాలిక మట్టిరోడ్లు చిన్నపాటి వరదలకు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**నాలుగింటిలో పూర్తయింది ఒక్కటీ లేదు**

ఎల్లారెడ్డిపేట మండల పరిధిలో నాలుగు చోట్ల వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తికాకపోవడం అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పనులను వేగిరం చేయడంపై ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా ప్రజలకు ప్రయాణ కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. ఎల్లారెడ్డిపేట సమీపంలో ఎల్లారెడ్డిపేట- మరిమడ్ల ప్రధాన రహదారిలో రాపెల్లివాగుపై బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా కొనసాగుతోంది. వాగుపై వేసిన తాత్కాలిక మట్టిరోడ్డు చిన్నపాటి వరదలకు కొట్టుకుపోవడం పరిపాటిగా మారుతోంది. వరదలు తగ్గి, రోడ్డు పునరుద్ధరణ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతంలో వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. వంతెన నిర్మాణంలో స్లాబు దశ పూర్తవగా రక్షణ గోడల ఏర్పాటు పనులు చేస్తున్నారు. వారధికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డును ఎప్పుడు వేస్తారనే సందిగ్ధత నెలకొంది. ఇదే రోడ్డుపై అల్మాస్‌పూర్ వద్ద లో లెవల్ కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ. 80 లక్షల స్టేట్ సబ్‌ప్లాన్ నిధులు మంజూరవగా ఈ ఏడాది మార్చిలో పనులను ప్రారంభించారు. స్లాబ్ దశ పూర్తికాగా అప్రోచ్ రోడ్లను నిర్మించాల్సి ఉంది. బ్రిడ్జిపై వాహనాలు వెళుతున్నప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా తయారైంది. వాహనాలను అజాగ్రత్తగా నడిపితే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. అలాగే మండలంలోని రాచర్ల గొల్లపల్లి- అల్మాస్‌పూర్ రహదారిలో గంగమ్మ ఆలయం వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఏడాది కిందట రూ. 1.10 కోట్ల సీఆర్‌ఎఫ్(సెంట్రల్ రోడ్ ఫండ్) నిధులు మంజూరవగా ఈ సంవత్సరం మార్చిలో పనులను ప్రారంభించారు. స్లాబు దశ పూర్తికాగా అప్రోచ్ రోడ్డు పనులు మిగిలిపోయాయి. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిపై నుంచి వాహనాలు వెళుతున్నప్పటికీ అక్కడికి చేరుకోగానే జాగ్రత్తలు పాటించాలి. మట్టిపోయడం వల్ల శ్మశానవాటికకు దారి మూసుకుపోయింది. ఇదే రోడ్డులో కిష్టునాయక్‌తండా వద్ద లోలెవల్ కాజ్‌వే స్థానంలో రూ. 60 లక్షల సీఆర్‌ఎఫ్ నిధులతో వంతెన నిర్మాణ పనులను ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించారు. పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పిల్లర్ల నిర్మాణాలు పూర్తికాగా స్లాబు వేసి, బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్డును వేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పనుల్లో జాప్యం వల్ల ఈ ఏడాది వంతెన నిర్మాణం పూర్తయ్యేటట్టు లేదు.

ఎల్లారెడ్డిపేట శివారులోని రాపెల్లివాగుపై నిర్మాణంలో ఉన్న వారధి ఇదీ. గిద్దెచెరువు మత్తడి దూకితే ఇక్కడ ఉన్న లో లెవల్ కాజ్‌వేపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోతాయి. దీంతో మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు వీర్నపల్లి మండలానికి రవాణా సంబంధాలుండవు. వాగుపై వారధి నిర్మాణానికి స్టేట్ సబ్‌ప్లాన్ నిధులు రూ. 2.20 కోట్లు మంజూరవగా భూమిపూజ చేసి రెండేళ్ల కాలం దాటుతోంది. ప్రస్తుతం స్లాబ్‌దశ పూర్తయింది. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి.

**అస్తవ్యస్తంగా పనులు- కుమార్‌యాదవ్, దుమాల**

రాపెల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో తాత్కాలిక మట్టిరోడ్డు తెగిపోతుండటంతో ఎల్లారెడ్డిపేట నుంచి దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాలతోపాటు వీర్నపల్లి మండలానికి రవాణా సంబంధాలు తెగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి.

**వర్షాలు నిలిచిపోగానే అప్రోచ్ రోడ్ల నిర్మాణం**
**- కిరణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ**

కిష్టునాయక్‌తండా వద్ద పిల్లర్లపై స్లాబు వేయాల్సి ఉంది. మిగిలిన మూడు వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. డిసెంబరు వరకు గడువు ఉంది. వర్షాల వల్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలుగుతోంది. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత నెల రోజుల్లోపు రోడ్డును వేస్తాం. నిబంధనల మేరకే పనులు జరుగుతున్నాయి. పర్యవేక్షణ ఉంది. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నారు.

## మరో మూడు బీసీ గురుకులాలు

ఖమ్మం : ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక బీసీ గురుకులం ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రెట్టింపు సంఖ్యలో 22 గురుకులాలను ఏర్పాటు చేసింది. అయినా ప్రవేశాలకు విద్యార్థుల నుంచి బాగా డిమాండ్ ఉండటంతో ఈ విద్యాసంవత్సరం 2022-23 నుంచి మరో మూడు బీసీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లను చేస్తోంది. కేటాయింపు ఇలా... ఉమ్మడి జిల్లాకు మూడు బీసీ గురుకులాలు మంజూరు కాగా అందులో రెండు బీసీ గురుకుల పాఠశాలలు, ఒక డిగ్రీ కళాశాల ఉన్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక్కో బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో బీసీ గురుకుల డిగ్రీ కళాశాల లేకపోవడం విద్యార్థులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. దీంతో ఖమ్మం నగరంలో నూతనంగా బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అన్ని ఆదేశాలు ఆర్సీవోకు అందాయి.

**480 మంది విద్యార్థులకు అవకాశం**

బీసీ గురుకుల పాఠశాలలను ఈ విద్యాసంవత్సరం అంటే సెప్టెంబర్ 15లోగా ప్రారంభించాలనే సంకల్పంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. ఈ గురుకులాల్లో మొదటగా 5,6,7 తరగతులను ప్రారంభించి ప్రతి ఏడాది ఒక తరగతి చొప్పున అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 240 మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంది. దీంతోపాటు నూతన బీసీ డిగ్రీ గురుకుల కళాశాలలో 7 కోర్సులను ప్రారంభించే అవకాశం ఉంది. భవనాల కోసం వేటబీసీ గురుకులాలు ఏర్పాటు చేసేందుకు కొత్త భవనాల కోసం అధికారులు వెతుకుతున్నారు. కొత్తగూడెం జిల్లాలో ఒక ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. కొణిజర్ల మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం అద్దెకు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.



# పోలవరం నిధులపై జగన్ నోరెత్తరా?

## పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన పూర్తి నిధులపై సీఎం జగన్ నోరెత్తరా..?

పోలవరం ప్రాజెక్టుకు ఇక 12,911.15 కోట్లు మాత్రమే ఇవ్వబోతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ తేల్చేసింది. పోలవరానికి పూర్తి నిధులు ఇచ్చేది లేదని కేంద్రం కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నా.. సీఎం జగన్ మాత్రం నోరెత్తడం లేదు. వైకాపాను గెలిపిస్తే.. కేంద్రం మెడలు వంచి నిధులు తెస్తామని ఢంకా బజాయించి చెప్పిన జగన్ మాటలు నమ్మి ప్రజలు 22 మంది ఎంపీలను గెలిపించారు. అయినా కేంద్రం మెడలు వంచడం సంగతి అటుంచి.. దిల్లీ పెద్దల ముందు ఈయనే మెడలు వంచుకుని బతిమాలుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్క్‌లను ప్రారంభించిన సీఎం వైయస్ జగన్



వైయస్ఆర్ జిల్లా: కడప నగరంలో రూ.871.77కోట్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా రూ.1.37 కోట్లతో పూర్తయిన రాజీవ్ పార్కు అభివృద్ధి పనులను, రూ. 5.61 కోట్లతో పూర్తయిన రాజీవ్ మార్గ్ అభివృద్ధి పనులను సీఎం వైయస్ జగన్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు అంజాద్ బాషా, ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, మేడా మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ సురేష్ బాబు, జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్నాధ్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్కును సీఎం వైయస్ జగన్ పరిశీలించి, అక్కడికి వచ్చిన పలువురుని ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులను అభినందించారు.

## 'పుల్లన్న పులివెందుల సంతకు పోనూ పొయ్యాడు..రానూ వచ్చాడు'.. జగన్‌పై తులసిరెడ్డి విసుర్లు



అమరావతి: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కడప జిల్లా పర్యటనపై పీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ తులసిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... "పుల్లన్న పులివెందుల సంతకు పోనూ పొయ్యాడు.. రానూ వచ్చాడు ఒట్టి చేతులతో" అన్నట్లుగా ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉందని సెటైర్లు విసిరారు. జగన్ శంకుస్థాపనల స్పెషలిస్ట్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జమ్మలమడుగు స్టీల్ ప్లాంట్‌కు రెండు సార్లు శంకుస్థాపన జరిగిందని.. అతీ గతీ లేదని మండిపడ్డారు. 2019, డిసెంబర్‌లో కుందూ – పెన్నా ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు మొదలే కాలేదన్నారు. అలాగే అదే రోజు రూ.1357 కోట్లతో రాజోలి జలాశయం శంకుస్థాపన జరుగగా.. పురోగతి లేదన్నారు. వీటితో పాటు రూ.312 కోట్లతో జొలద రాశి జలాశయం శంకుస్థాపన జరిగిందని.. ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు అక్కడి పరిస్థితి ఉందని విమర్శించారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో ప్రచారమే తప్ప పరిశ్రమలు రాలేదన్నారు. రూ.55 కోట్లతో దేవుని కడప చెరువు సుందరీకరణ లేదని.. రూ.30 కోట్లతో బుగ్గవంక సుందరీకరణ లేదని మండిపడ్డారు. అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు పునరావాసం పూర్తి కాలేదన్నారు. వేంపల్లి – రాయచోటి రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయి ప్రయాణికులు భూలోకంలో యమలోకం చూస్తున్నారన్నారు. కడపలో ఉండే బ్రౌన్ లైబ్రరీకి రూ.5.50కోట్లు ఇస్తామని చెప్పి 5 పైసలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోవు ఎన్నికల్లో ఓడిపోయి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేలోపు శంకుస్థాపన చేసిన వాటిని పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేసి దిగిపోతే మంచిది అంటూ తులసిరెడ్డి వ్యాఖ్యానించారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

అమరావతి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 36 గంటల దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన దీక్షకు అంగన్‌వాడీ కార్మికులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించడం మానేసి.. దీక్షలో పాల్గొంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ హెచ్చరిస్తున్నారని వాపోయారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలను, బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా మారుతోందని వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగవిరమణ ప్రయోజనాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక దీక్షలు చేస్తామని హెచ్చరించారు. మరోవైపు అనంతపురం, విశాఖపట్నం, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం,కడప తదితర జిల్లాల కలెక్టరేట్ల వద్ద దీక్షలు కొనసాగుతున్నాయి.





## దిల్లీ వేదికగా.. భగ్గుమన్న చైనా-అమెరికా విభేదాలు

అమెరికా–చైనా మధ్య విభేదాలు మరో సారి భగ్గుమన్నాయి. ఈ సారి వీరి గొడవకు దిల్లీ కేంద్రంగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కార్యవర్గంలో మానవహక్కుల విభాగం ఉన్నతాధికారి ఉజ్రా జియా.. టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాతో భేటీ అయ్యారు. వీరి భేటీకి దిల్లీ వేదికైంది. దీంతో అమెరికా తీరుపై చైన్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టిబెట్ సంబంధిత అంశాల పేరిట అమెరికా తమ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం ఆపాలని చైనా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయ ప్రతినిధి వాంగ్ షియావ్‌జియాన్ ట్విటర్ వేదికగా స్పందించారు. "షిజాంగ్ (టిబెట్ చైనీస్ పేరు) మా దేశంలో అంతర్భాగమన్న దాని నిబద్ధతకు కట్టుబడి ఉండేందుకు అమెరికా గట్టి చర్యలు తీసుకోవాలి. షిజాంగ్ పేరిట చైనా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం ఆపాలి. దలైలామా బృందం చేపట్టే చైనా వ్యతిరేక కార్యకలాపాలకు ఎటువంటి మద్దతు ఇవ్వకూడదు" అని పేర్కొన్నారు. "షిజాంగ్ వ్యవహారాలు పూర్తిగా చైనా అంతర్గతమైనవి. వీటిల్లో బాహ్యశక్తుల జోక్యానికి ఎటువంటి అర్హత లేదు. టిబెట్ స్వాతంత్ర్యం కోరుకొనే శక్తులు.. విదేశీ దౌత్యవేత్తల మధ్య ఎటువంటి సంబంధాలనైనా చైనా బలంగా వ్యతిరేకిస్తుంది" అని చైనా ప్రతినిధి తేల్చి చెప్పారు. అంతేకాదు.. అమెరికా ఉన్నతాధికారి ఉజ్రా జియాకు అక్కడి ప్రభుత్వం 'టిబెట్ వ్యవహారాల సమన్వయకర్త' హోదా ఇవ్వడం కూడా పూర్తిగా నేరపూరితమని పేర్కొన్నారు. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి, టిబెట్‌లో అభివృద్ధి, స్థిరత్వాన్ని తక్కువ చేసి చూపడానికి తీసుకొన్న చర్యగా అభివర్ణించారు. టిబెట్ ప్రవాస ప్రభుత్వాన్ని పూర్తిగా వేర్పాటువాద రాజకీయ సంఘంగా చైనా ప్రతినిధి పేర్కొన్నారు. అది చైనా చట్టాలకు వ్యతిరేకమన్నారు. దానికి ప్రపంచంలో ఏ దేశం గుర్తింపు లభించలేదని తెలిపారు. అమెరికా మానవహక్కుల విభాగం ఉన్నతాధికారి ఉజ్రా జియా తన భారత పర్యటనలో భాగంగా న్యూదిల్లీలోని దలైలామాతో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని ప్రవాస టిబెట్ ప్రభుత్వం కోసం పనిచేసే సెంట్రల్ టిబెటియన్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. ఉజ్రా జియా జులై8 నుంచి 14వ తేదీ వరకు భారత్, బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె భారత్‌లోని ఉన్నతాధికారులను కూడా కలవనున్నారు. ఈ పర్యటనలో ఆమె వెంట అమెరికా విదేశాంగ సహాయ మంత్రి డొనాల్డ్ లూ కూడా ఉన్నారు.



## నది ఉద్ధృతిలో ఎన్డీఆర్ఎఫ్ డేరింగ్ ఆపరేషన్

శిమ్లా: భారీ వర్షాలతో ఉత్తరాది రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలమైంది. రాష్ట్రంలో ప్రధానమైన బియాస్ నది ఉగ్రరూపం దాల్చడంతో పలు ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. దీంతో రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ వరదల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టి బియాస్ నదిలో చిక్కుకున్న ఆరుగురిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. మండి జిల్లాలోని నగ్వయిన్ గ్రామ సమీపంలో బియాస్ నది ఉప్పొంగి ప్రవహించడంతో పలువురు చిక్కుకుపోయారు. సమాచామందుకున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదిలో అర్ధరాత్రి డేరింగ్ ఆపరేషన్ నిర్వహించారు. జిప్‌లైన్ ఏర్పాటు చేసి కేబుల్ సాయంతో వారిని కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఓ వ్యక్తి కేబుల్‌ను గట్టిగా పట్టుకోగా.. సిబ్బంది లాగుతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. అత్యంత ప్రతికూల, కఠినమైన వాతావరణంలో ఎన్డీఆర్ఎఫ్ సాహసోపేతంగా వ్యవహరించి ప్రజలను కాపాడటంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



## వార్నింగ్ మార్క్‌ను దాటిన యమునా నది

దిల్లీ: దేశ రాజధాని దిల్లీని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు యమునా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే వార్నింగ్ మార్క్‌ను దాటిన నది నీటిమట్టం.. ప్రమాదకర స్థాయికి చేరువైంది. ఈ నేపథ్యంలోనే దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అత్యవసర సమావేశం నిర్వహించారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. వర్షాలపై అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతానికి దిల్లీకి వరద పరిస్థితి రాకపోవచ్చని పేర్కొన్నారు. "ఇది ఒకర్నొకరు నిందించుకునే సమయం కాదు. ప్రజలకు సహాయం అందించేందుకు మనమంతా కలిసి పనిచేయాలి. యమునా నదిలో నీటిమట్టం పెరుగుతుండటంతో కేంద్ర జల కమిషన్‌ను సంప్రదించాం. అయితే దిల్లీలో వరదలు సంభవించే పరిస్థితులు ప్రస్తుతానికి లేవని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే.. పరిస్థితులకు అనుగుణంగా మేం సిద్ధంగా ఉన్నాం. ఒకవేళ నీటిమట్టం 206 మీటర్లు దాటితే యమునా నది పరిసరాల్లో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయిస్తాం" అని వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా రోడ్లపై గుంతలను ఎప్పటికప్పుడు పూడుస్తున్నట్లు తెలిపారు. ఇటీవల దిల్లీలో రోడ్లు కుంగిన ఘటనలపై విచారణకు ఆదేశించినట్లు చెప్పారు.

**ప్రమాదకర స్థాయికి చేరువైన యమున..** భారీ వర్షాల కారణంగా హతనికుండ్ బ్యారేజ్ నుంచి హరియాణా మరింతగా నీటిని విడుదల చేసింది. దీంతో యమునా నది నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న అధికారిక సమాచారం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయానికి దిల్లీలోని పాత రైల్వే బ్రిడ్జ్ వద్ద యమునా నది నీటిమట్టం వార్నింగ్ మార్క్ (204.5 మీటర్లు) దాటి 204.63 మీటర్లకు చేరింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నాటికి నీటిమట్టం ప్రమాదకర స్థాయి (205.33 మీటర్లు)ని దాటి 205.5 మీటర్లకు చేరే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ముప్పు పొంచి ఉండటంతో దిల్లీ అధికారులు అప్రమత్తమయ్యారు. దిల్లీ మంత్రి ఆతిషి యమునా నది పరిస్థితిని పర్యవేక్షించారు. ఇప్పటికే 16 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. క్విక్ రెస్పాన్స్ టీమ్, బోట్లను అందుబాటులో ఉంచారు.

## హైదరాబాద్‌లో పవన్ ఎంజాయ్ స్టార్.. ఆంధ్రలో గంజాయి స్టార్.. గుడివాడ అమర్‌నాథ్ సంచలనం




విశాఖపట్నం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ఎంజాయ్ స్టార్ అని.. ఆంధ్రలో గంజాయి స్టార్ అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పొలిటికల్ సైడ్ హీరో, తిరుగుబోతు సంసారం గురించి మాట్లాడితే ఎలా ఉంటుందో, పవన్ కళ్యాణ్ రాజకీయాల గురించి మాట్లాడితే అలాగే ఉంటుందన్నారు. పవన్ నిరాశ, ఆవేదన బాధతో ఉన్మాదిలా మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడు మాట్లాడాల్సిన మాటలేనా? అవి అని గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ నిన్న చేసిన వ్యాఖ్యలను, వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అంటారని పవన్‌ను ఎద్దేవా చేశారు. వలంటీర్లు ఎక్కడ అమ్మాయిలు ఉన్నారో ఆ సమాచారం ఇస్తున్నారని విమర్శలు చేస్తున్నారన్నారు. ఏపీ వాలంటీర్ వ్యవస్థను కించ పరిచేలా పవన్ వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ రాష్ట్రంలో పవన్‌ను చూస్తేనే ఎక్కడ కనిపిస్తే తాళి కట్టేస్తారేమోనని ఆడపిల్లలు భయపడుతున్నారని గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ జనసేనాని కాదని, చంద్రబాబు సేనాని అని ఎద్దేవా చేశారు. జనసేనను టీడీపీలో కలిపి వేయచ్చు కదా అని ప్రశ్నించారు. వేర్వేరు బ్యానర్‌లో ఉంటేనే డబ్బులు వస్తాయని కలపడం లేదన్నారు. వెబ్ సిరీస్‌లా వారాహి యాత్ర ఉందన్నారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను వైసీపీ ఖండిస్తోందన్నారు. పవన్, చంద్రబాబు, లోకేష్ కలిసి తిరగవచ్చు కదా అని ప్రశ్నించారు. వారు అధికారంలోకి వస్తే పథకాలు తీసేస్తామని, వలంటిర్ వ్యవస్థను రద్దు చేస్తామని చెపొచ్చు కదా అని గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు.

## పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు



అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఏపీలో మహిళలు కనిపించకుండా పోతున్నారంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ స్పందించింది. పది రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఏ కేంద్ర నిఘా వ్యవస్థ చెప్పిందో సమాచారం ఇవ్వాలని కోరింది. పవన్ చెబుతున్నట్లుగా తప్పిపోయిన మహిళల వివరాలు ఇవ్వాలని మహిళా కమిషన్ డిమాండ్ చేసింది. వివరాలు తెలిపిన కేంద్ర అధికారి ఎవరో చెప్పాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశించింది. ఆదివారం ఏలూరు నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల అదృశ్యాలకు వాలంటీర్లే కారణమని, వైకాపా పాలనలో అదృశ్యమైన 30 వేల మందిలో 14 వేల మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. " వైకాపా పాలనలో ప్రతి గ్రామంలో వాలంటీర్లను పెట్టి కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? వారిలో మహిళలు ఎందరు? వితంతువులున్నారా? అని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఒంటరి మహిళలే లక్ష్యంగా సమాచారం సేకరించి సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు" అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.



## షర్మిలను ఆహ్వానిస్తున్నాం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చిన్న మాట అన్నదానికి రెండేళ్ల జైలు శిక్ష ఎలా వేస్తారని మాజీ ఎంపీ చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... గుజరాత్ హైకోర్టు రాహుల్ గాంధీకి ఇచ్చిన తీర్పు కూడా అంత ఆశజనకంగా లేదన్నారు. చిన్న మాట అంటేనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి చిన్నాన్న చనిపోయి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకు ఎవరికీ శిక్ష పడలేదన్నారు. అందరికీ సమన్యాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వారిపై సీబీఐ, ఈడీ కేసులు పెడతారన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు అన్నీ కూడా ప్రధాని మోడీ ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, నిత్యవసర ధరలు పెంచుకుంటూ ప్రధాని వెళ్తున్నారన్నారు. దేశ ప్రధాని ఒక రాష్ట్రంలో అవినీతి జరిగిందని చెప్పడం బాధాకరమని.. తొమ్మిదేళ్ల మోడీ పాలనలో బీజేపీ సాధించినది శూన్యమని ఆయన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగితే వైసీపీకి 20 సీట్లు కంటే ఎక్కువగా రావడం కూడా కష్టమే అన్నారు. పవన్‌ను చూస్తే జాలి వేస్తుందని... పవన్ కళ్యాణ్ యాత్ర థీమ్ లేకుండా రాజకీయాల్లోకి రావడం, సందేశం లేని సినిమాలా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తేనే దేశానికి రక్ష అని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 25 స్థానాల్లో 15 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయాలను శాసించబోయేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న దళితులు డిసైడ్ చేయబోతున్నారన్నారు. పేదవాళ్లకి న్యాయస్థానాల్లో న్యాయం జరగడం లేదని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయం మారిపోయిందని విమర్శించారు. షర్మిలను కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానిస్తున్నామని... కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని చింతామోహన్ వెల్లడించారు.

## ఛాన్సులు లాక్కున్నారంటూ హీరోయిన్ ఆరోపణలు!

బాలీవుడ్ నటి అమీషా పటేల్ సంచలన ఆరోపణలు చేసారు. తన విజయాన్ని చూసి కొందరు ఓర్వలేకపో యారని...తన ఎదుగుదలని జీర్ణించుకోలేక కొంత మంది వెన్నుపోటు దారులుగా మారితే..మరికొంత మంది తన అవకాశాల్నే లాగేసుకున్నారని ఆరోపించింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అమీషా ఈ వ్యాఖ్యలు చేసారు. నేను ఫిల్మ్ ఇండస్ట్రీలో కాలుపెట్టిన సమయంలో నాతో పాటూ యాక్టర్లు.. నిర్మాతలు పిల్లలు అరంగేట్రం చేశారు. కరీనా కపూర్.. అభిషేక్ బచ్చన్.. హృతిక్ రోషన్.. తుషార్ కపూర్.. ఈషా డియోల్.. ఫర్దీన్ ఖాన్.. ఇలా చాలా మంది వారసులు వచ్చారు. ఎటు తలతిప్పినా సినీకుటుంబాలకు చెందిన మూడో తరం వారు కనిపించేవారు. వాళ్ల మధ్యలో నేను ఒక్కరినే. ఎలాంటి సహకారం లేకుండా పరిశ్రమకి



వచ్చినదాన్ని. నాకు వచ్చిన అవకాశాలతో సంతృప్తిగా సినిమాలు చేసేదాన్ని. అలా నటిగా ఎదిగాను. సెట్లో నా పని చూసుకోవడం తప్ప ఇతర విషయాల పట్ల అనాసక్తిగా ఉండేదాన్ని. పుస్తకాలు చదువుకునేదాన్ని. నా పని తప్ప ఇతర విషయాల గురించి పట్టించుకునే దాన్ని కాదు. ముఖ్యంగా ఎవరిపైనా రూమర్స్ గురించి మాట్లాడేదాన్ని కాదు. సెట్లో చీటికీమాటికీ అలకలుబూనే దాన్ని కాదు. ఇలా ఉండటం కూడా అక్కడ భావ్యం కాదు. నేను అతి చేస్తున్నానని కొందరు అనుకునేవారు. నా చుట్టూ ఉన్న సహచరులు అలా భావించి వదల్లేదు వారు నా సక్సెస్ చూసి ఓర్వలేకపోయారు. కొందరు నా నుంచి సినిమాలను కూడా లాగేసుకున్నారు అని అంది. అమీషా పటేల్ బాలీవుడ్ లో హృతిక్ రోషన్ సరసన కహోనా ప్యార్ హై సినిమాతో అరంగేట్రం చేసింది. ఆ సినిమా బంపర్ హిట్ కావడంతో అమీషా పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. కొన్నాళ్ల పాటు నటిగా తిరిగి లేని జర్నీ సాగించింది. అటుపై బద్రీ సినిమా తో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. కానీ ఇక్కడ ఎక్కువగా సినిమాలు చేయలేదు. బాలీవుడ్ కెరీర్ పైనే దృష్టి పెట్టి పనిచేసింది.

## లింగ వివక్షపై 'లైగర్' భామ రుసరుసలు!

ఇండస్ట్రీలో లింగ వివక్షపై ఎప్పటికప్పుడు నటీమణులు గళ మెత్తుతూనే ఉంటారు. హీరోల చిత్రాలకు ఉన్న క్రేజ్ లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకు ఉండదని..ఇది కచ్చితంగా లింగ వివక్షలో భాగమంటూ ఇప్పటికే కొంత మంది బాలీవుడ్ హీరోయిన్లు బహిరంగానే వ్యతిరేకించారు. నిజమే హీరోల చిత్రాలకు ఉన్నంత మైలేజ్ హీరోయిన్ ఓరియేండెట్ చిత్రాలకు ఉండదన్నది వాస్తవం. దీనికి ఇండస్ట్రీ కారణం ఒక్కటే కాదు. ఇక్కడ దర్శకుడిని అనుకోవడానికి ఆస్కారం లేదు. ఈ విషయంలో ప్రధాన పాత్ర పోషించేది సమాజం అన్నది వాస్తవంగా గుర్తించాల్సిన అంశం. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు సక్సెస్ అవ్వాలంటే హీరోల కు ధీటుగా ఇమేజ్ ని కల్గి ఉండాలి. అయినా ఆ క్రేజ్ ఎంతో కాలం ఉండదు. చాలా పరిమింతంగానే హీరోయిన్ల వృత్తి జీవితం కొనసాగుతుంది. హీరోలతో పోల్చితే హీరోయిన్లకు లైఫ్ తక్కువ అన్నది తెలిసిందే. ఈ విషయంలో ఆడియన్ ఆలోచనలో సైతం మార్పులొస్తే తప్ప వివక్ష అన్నది తొలగిపోని అంశంగానే మిగిలిపోతుంది. లింగ వివక్షపై దీపికా పదుకొణే..కంగనా రనౌత్ లాంటి వారు ఇప్పటికే



చాలాసార్లు మీడియా ముఖంగా స్పందించారు. దీనికి రకరకాల కారణాల్ని సైతం విశ్లేషించారు. కొన్ని రోజుల క్రితం నటి తాప్సీనటీనటుల చిత్రాలను చూడటానికి ప్రేక్షకులు పరిగెత్తుకు వస్తారు కానీ నటీమణుల చిత్రాలను చూడటానికి అంత ఆసక్తి చూపించరన్నారు. ప్రేక్షకులు ఎప్పటినుంచో ఇదే విధానికి అలవాటు పడిపోయి ఉన్నారు. అందులో మార్పులు వస్తే తప్ప వివక్ష తొలగిపోదు అని అభిప్రాయపడ్డారు. తాజాగా యంగ్ హీరోయిన్ అనన్య పాండే కూడా ఇదే విషయంపై స్పందించింది. నటీమణులు అభిరుచితో ఏదైనా కొత్త ప్రయత్నం చేసినా ప్రోత్సహించడానికి ప్రేక్షకులు ముందుకు రావడం లేదు. అదే ఒక నటుడు అలాంటి ప్రయత్నాలు చేస్తే బ్రహ్మరథం పడుతున్నారు. ఎందుకింత వ్యత్యాసం? ఒక నటుడు నటించినా...చెడ్డ పాత్ర చేసినా మార్కెట్ లో చెల్లిపోతుంది. సినిమా రంగంలో హీరోయిన్ కేవలం కొంత వరకే పరిమితం అవుతుంది అన్న భావనని అనన్య బయటపెట్టింది. 'లైగర్' సినిమాతో అనన్య పాండే టాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో భామ విజయ్ దేవరకొండతో రొమాన్స్ చేస్తుంది. తెలుగు..హిందీ భాషల్లో చిత్రాన్ని తెరకెక్కించారు. ధర్మ ప్రొడక్షన్స్-పూరి కనెక్ట్స్ సంయుక్తంగా నిర్మించాయి. బాలీవుడ్ లో చుంకీపాండే వారసురాలిగా అనన్య పాండే ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ రెండు..మూడు సినిమాల్లో నటించింది. ఇటీవలే విడుదలైన 'గెహ్రాయాన్' లో నూ అనన్య నటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులు అందుకుంటూ యువ భామగా వెలిగిపోతుంది.




# రత్తాలు గ్లామర్ షో నెక్ట్స్ లెవెల్..!



కొందరు హీరోయిన్స్ సౌత్ నార్త్ అనే తేడా లేకుండా అక్కడ ఇక్కడ అదరగొట్టేస్తుంటారు. ముఖ్యంగా సౌత్ సినిమాలు చేసి ఆ తర్వాత బాలీవుడ్ షిఫ్ట్ అయిన భామలు చాలా మంది ఉన్నారు అలాంటి వారిలో రాయ్ లక్ష్మి కూడా ఒకరు. తెలుగు తమిళ సినిమాల్లో హీరోయిన్ గా ప్రయత్నించిన రాయ్ లక్ష్మి ఇక్కడ సరైన అవకాశాలు లేవని బాలీవుడ్ కి షిఫ్ట్ అయ్యింది. తెలుగులో ఆమె చేసిన సినిమాలేవి అంతగా ప్రేక్షకాదరణ పొందలేదు. హీరోయిన్ గా వర్క్ అవుట్ అవని రాయ్ లక్ష్మి స్పెషల్ సాంగ్స్ తో మాత్రం క్రేజ్ తెచ్చుకుంది. కొందరు హీరోయిన్స్ కొన్నిటికి బాగా మ్యాచ్ అవుతారన్నట్టు రాయ్ లక్ష్మి స్పెషల్ సాంగ్స్ కి పర్ఫెక్ట్ అనిపించుకుంది. అందుకే తెలుగులో ఆమెని అలానే వాడేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ఖైదీ నెంబర్ 150 లో కూడా రత్తాలు రత్తాలు సాంగ్ తో రచ్చ చేసింది రాయ్ లక్ష్మి. ఖాళీగా ఉండటం కన్నా ఏదో ఒకటి చేయడం బెటర్ కదాని రాయ్ లక్ష్మి ఆలోచన. అందుకే వచ్చిన ప్రతి ఛాన్స్ ని వాడుకుంటుంది. ఇక తెలుగులో 2019లో వేర్ ఈజ్ వెంకటలక్ష్మి సినిమాలో నటించింది రాయ్ లక్ష్మి. బాలీవుడ్ లో రీసెంట్ గా వచ్చిన బోళా సినిమాలో రాయ్ లక్ష్మి నటించింది. ప్రస్తుతం మలయాళంలో డి.ఎన్.ఏ సినిమాలో నటిస్తుంది. సినిమాలకు ఈక్వల్ గా రాయ్ లక్ష్మి ఫోటో షూట్స్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు తన కిరాక్ ఫోటోస్ షేర్ చేసింది. స్నాక్ టైం లో అలా స్నాక్ పక్కన పెట్టుకుని తన వయ్యారంతో వారెవా అనిపించేస్తుంది అమ్మడు. గ్లామర్ షోలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్ ఉంటుంది. ఎవరిది ఎలా ఉన్నా రాయ్ లక్ష్మి ఫోటో షూట్స్ మాత్రం సంథింగ్ స్పెషల్ గా ఉంటుంది. డార్క్ బ్రౌన్ కలర్ లాంగ్ టాప్.. వైట్ కలర్ ఇన్నర్ వేర్ తో తన ఫాలోవర్స్ ని తన బుట్టలో పడేస్తుంది రాయ్ లక్ష్మి. అలానే చూస్తూ ఉండిపోయేలా అమ్మడి గ్లామర్ ఎటాక్ ఉంది. సినిమాలతో కన్నా రాయ్ లక్ష్మి ఫోటో షూట్స్ కి బీభత్సమైన క్రేజ్ ఏర్పడింది. అమ్మడి లేటెస్ట్ ఫోటో షూట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. రత్తాలు చేస్తున్న ఈ అందాల ప్రదర్శనకు తన ఫాలోవర్స్ అంతా ఫిదా అవుతున్నారు. ఈ ఫోటో షూట్స్ తోనే అమ్మడు ఇన్ స్టాగ్రాం లో 7 మిలియన్ల పైగా ఫాలోవర్స్ ని ఏర్పరచుకుంది.

# రకుల్ స్టన్నింగ్ షో.. ఇలా అసలు ఊహించలేదు!





గ్లామరస్ హీరోయిన్ గా సౌత్ ఇండస్ట్రీలోనే కాకుండా అటు బాలీవుడ్ ఇండస్ట్రీలో కూడా మంచి క్రైజ్ అందుకున్న రకుల్ ప్రీత్ సింగ్ ఈ మధ్యకాలంలో ఊహించని లుక్స్ తో షాక్ ఇస్తోంది. అమ్మడు ఎలాంటి డ్రెస్ వేసినా కూడా అందులో గ్లామర్ డోస్ హై రేంజ్ లో ఉండే విధంగా కూడా దర్శనమిస్తోంది. గతంలో కూడా ఇదే తరహాలో కనిపించిన సందర్భాలు ఉన్నాయి కానీ ఆమె ఇప్పుడు అంతకంటే ఎక్కువ స్థాయిలోనే హీటెక్కిస్తోంది. ఇక రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలతో బిజీగా ఉన్నా లేకున్నా కూడా తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా మాత్రం ఫ్యాన్స్ ను ఎప్పటికప్పుడు అందంతో అట్రాక్ట్ చేసే ప్రయత్నం అయితే చేస్తోంది. ఇక ఇటీవల రకుల్ బీచ్ లో ఎంజాయ్ చేస్తూ నవ్వుతూ ఫోటోలకు స్టిల్స్ ఇచ్చింది. ఇక ఆ ఫోటోలలో అమ్మడు తన ఎద అందాలను చాలా ఘాటుగానే ప్రజెంట్ చేసింది. గతంలో కూడా ఈ బ్యూటీ ఈ తరహాలో కనిపించినప్పటికీ ఈ స్టిల్స్ మాత్రం చాలా నేచురల్ గా బ్యూటిఫుల్ గా ఉన్నాయని ఓ వర్గం నెటిజన్లు పాజిటివ్ గా స్పందిస్తున్నారు.

అంతేకాకుండా రకుల్ రేంజ్ అసలు తగ్గలేదు అని కూడా మరి కొందరు రియాక్ట్ అవుతున్నారు. ఇక ఈ బ్యూటీ కి గత కొంతకాలంగా తెలుగు చిత్ర పరిశ్రమలు అయితే సరైన విజయాలు రావడం లేదు. రొటీన్ కమర్షియల్ సినిమాలు కాకుండా కాస్త విన్నమైన కథలను కూడా చేయడానికి ప్రయత్నం చేస్తోంది. కానీ అవి కూడా అంతగా సక్సెస్ అయితే కావడం లేదు అందుకే పూర్తిస్థాయిలో రకుల్ ఎక్కువగా బాలీవుడ్ ఇండస్ట్రీ పైన ఫోకస్ చేస్తూ ఉన్నట్లు అర్థమైంది. అయితే రకుల్ కు అక్కడ కూడా భారీ స్థాయిలో అయితే ఇంతవరకు ఒక్క సక్సెస్ కూడా పడలేదు. కానీ సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ శంకర్ ఇండియన్ 2 సినిమాతో పాటు బాలీవుడ్లో 2 సినిమాలు చేస్తోంది.

## జబన్నీ బాడీ లాంగ్వేజ్ కి అలియాభట్ ఫిదా!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్టైలిష్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందుకే స్టైలిష్ స్టార్ అయ్యాడు. అంతటి ఘనకీర్తిని అందుకోవడం వెనుక స్టార్ మేకర్స్ సుకుమార్..పూరి జగన్నాథ్ ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. బన్నీ లో యాక్టింగ్ ట్యాలెంట్ తో పాటు..తనకంటూ ఓ స్టైలిష్ ఐడెంటీటీ దక్కిందంటే దానికి కారణం ఆ ఇద్దరి దర్శకులే. ఆర్య-2 నుంచి వెండి తెరపై సరికొత్త బన్నీని చూస్తున్నాం. జులాయి ఇద్దరమ్మాయిలతో సన్నాఫ్ సత్యమూర్తి నాపేరు సూర్య అల వైకుంఠపురములో లాంటి చిత్రాల్లో బన్నీ ఫ్రెష్ లుక్ లో ఆకట్టుకున్న వైనం సమ్ థింగ్ స్పెషల్ అనే చెప్పాలి. ఓ వైపు నటుడిగా షైన్ అవుతూనే మరోవైపు స్టైలింగ్ న్యూ ట్రెండ్ లోనూ మెప్పించడానికి ఆసక్తి చూపిస్తుంటాడు. బన్నీని స్టైలిష్ స్టార్ గా ఎలివేట్ చేయడం వెనుక తనలో ఆ క్వాలిటీ



కూడా కీలక పాత్ర పోషించిదని చెప్పొచ్చు. ఓ వైపు కమర్షియల్ చిత్రాల్లో మాస్ పాత్రల్లో మెప్పిస్తూనే క్లాస్ రోల్స్ తోనూ ప్రేక్షకాభిమానుల్ని అలరిస్తున్నారు. టాలీవుడ్ లో ఎంత పోటీ ఉన్నా బన్నీ తనకంటూ ఓ ఐడెంటీని..ఓ మార్గాన్ని నిర్ధేశించుకుని ముందుకు సాగుతున్నాడు. స్టైలింగ్ విషయంలో బన్నీ -సుకుమార్ ని ఓ గురువులా భావిస్తుంటారు. ఈ మాట ఓ సందర్భంలో బన్నీనే స్వయంగా చెప్పారు. తాజాగా బన్నీ స్టైలిష్ పెర్ఫార్మెన్స్ గురించి బాలీవుడ్ నటి అలియాభట్ ఆకాశానికి ఎత్తేసింది. అల్లు అర్జునే ఓ స్టైల్. అతను ధరించే కాస్ట్యూమ్స్ లోనో.. వేసే డాన్సుల్లోనే .. స్టైల్ గా ఉండాలనే ఉత్సాహమో అతన్ని స్టైలిష్ స్టార్ ని చేయలేదు. ఆ రకంగా స్టైలిష్ లుక్ రాలేదు. అతని బాడీ లాంగ్వేజ్ లోనే ఓ స్టైల్ ఉంది అని కితాబిచ్చింది. బన్నీ లుక్ పరంగా గంగోత్రి ఆర్య తర్వాత చాలా మార్పులు చేసిన సంగతి తెలిసిందే. ఆర్ ఆర్ ఆర్ చిత్రంతో అలియాభట్ టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైంది. సీతమ్మ పాత్రలో తెలుగు ఆడియన్స్ ని మెప్పిస్తుంది. ఆరంభంలోనే తొలి పాన్ ఇండియా సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది. అంతకు ముందే యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్ లో తెరకెక్కనున్న కొత్త చిత్రంలో హీరోయిన్ గానూ ఛాన్స్ అందుకుంది. ఇక బాలీవుడ్ లో అలియా వేగం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇటీవలే గంగూబాయి కతియావాడితో మరో బ్లాక్ బస్టర్ ని ఖాతాలో వేసుకుంది.

## ఇలా కవ్వించి గుండెల్లో రాజేస్తోంది!

ఫ్యాషనిస్టా అనే పదానికి నిర్వచనం ఈ బ్యూటీ. అందాల రాణిగా కిరీటం అదుకుని మోడల్ గా కెరీర్ ఆరంభించింది. అటుపై యష్ రాజ్ బ్యానర్ అండదండలతో సినీనాయికగా మనుగడ సాగిస్తోంది. ఇప్పటికిప్పుడు దాదాపు 1000 కోట్ల విలువ చేసే భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఈ ఏడాది అత్యంత భారీగా ఆదాయం ఆర్జిస్తున్న నటిగానూ వెలిగిపోతోంది. బాలీవుడ్ లో ఎందరు అగ్ర హీరోయిన్లు ఉన్నా తనకంటూ ఒక స్థానం ఉందని నిరూపిస్తోంది. ఇంతకీ ఎవరీ సుందరి?అంటే.. ది గ్రేట్ వాణీ కపూర్. అసలు వాణీ కపూర్ పరిచయం అవసరం లేదు. తెలుగులో ఆహాకల్యాణం చిత్రంలో నటించింది. నాని సరసన ఈ బ్యూటీ నటించినా సరైన హిట్ అందుకోలేకపోయినా బాలీవుడ్ లో మాత్రం తన రేంజు ఎక్కడా తగ్గలేదు. ఇటీవల పూర్తిగా బాలీవుడ్ కే పరిమితమైంది. అక్కడ యష్ రాజ్ బ్యానర్ లో వరుస చిత్రాల్ని చేస్తోంది. ఇంతకుముందు యష్ రాజ్ బ్యానర్ లోనే వార్ చిత్రంలో హృతిక్ సరసన నటించిన వాణీ కపూర్ ఆ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది. బాలీవుడ్ లో ఆరంగేట్రమే శుద్ దేశీ రొమాన్స్ చిత్రంతో విజయం అందుకుని బేఫికరే..చిత్రంతో ప్రేక్షకులకు మరింత చేరువైంది. ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీ నటిగా మారింది. వాణీకపూర్ సోషల్ మీడియాలో



ఎంత యాక్టివ్ గా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్లతో వాణీ ఇన్ స్టా వేదికగా టచ్ లో ఉంది. తాజాగా వాణీ సమ్మర్ స్పెషల్ లుక్ లో దర్శనమిచ్చింది. ఈ ఫోటో షూట్ లో వాణీ కపూర్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. రకరకాల ఫ్యాషన్స్ స్టైలింగ్ ని అనుకరిస్తూ చూపరుల మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే అమ్మడు నటించిన బెల్ బాటమ్ రిలీజ్ అయింది. అక్షయ్ సరసన నటించిన ఈ సినిమా కరోనా క్రైసిస్ లో రావడంతో ఆశించనంతగా రాణించలేదు. ప్రస్తుతం కరణ్ మల్హోత్రా తెరకెక్కిస్తోన్న షామ్ శ్రీ అనే భారీ బడ్జెట్ పిరియాడిక్ చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్..సంజయ్ దత్ హీరోలగా నటిస్తున్నారు. అలాగే అభిషేక్ కపూర్ దర్శకత్వంలో చండీఘర్ కరే ఆశీకిల్ లో నటిస్తోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నాడు. ప్రభాస్ సలార్ లోనూ వాణీ విలన్ గ్యాంగ్ లో కనిపిస్తుందని టాక్ వచ్చింది. కానీ దానికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంటుంది.




# భయపడొద్దు.. రంగంలో స్వర్ణలత

హైదరాబాద్: ఉజ్జయిని మహాకాళి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. బోనాల వేడుకల్లో భాగంగా ఇవాళ రంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగిని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ప్రజల పూజలు సంతోషంగా అందుకున్నానని చెప్పారు. గతేడాది మీరు ఇచ్చిన వాగ్దానం మరిచిపోయారన్నారు. కావాల్సిన బలాన్నిచ్చానని.. మీ వెంటా ఉంటానని చెప్పారు. ఆలస్యమైనా వర్షాలు తప్పకుండా వస్తాయన్నారు. "అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి..ప్రజలు భయపడవద్దు. నా వద్దకు వచ్చే ప్రజలను కాపాడే భారం నాదే. ఎలాంటి లోపాలు లేకుండా చూసుకునే భాధ్యత నాదే. ఐదు వారాలు తప్పనిసరిగా నైవేద్యాలు సమర్పించాలి. ఏ పూజలు చేసినా సంతోషంగా అందుకుంటున్నా. ఏది బయట పెట్టాలో ఏది పెట్టకూడదో నాకు మాత్రమే తెలుసు. నా దగ్గరకు వచ్చిన వారిని చల్లగా చుసుకునే బాధ్యత నాది" అని స్వర్ణలత అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా హాజరయ్యారు. భవిష్యవాణి వినేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు.

**అంబారీపై అమ్మవారి ఊరేగింపు :** మహాకాళి బోనాల ఉత్సవాల్లో భాగంగా అంబారీపై అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు ఆల్ఫా హెూటల్ మీదుగా మెట్టుగూడ వరకు కొనసాగింది. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని ఆలయానికి తీసుకువచ్చారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య కార్యక్రమం ఘనంగా జరిగింది.

# ఐటీ సేవల విస్తరణకు పటాన్‌చెరు కేంద్రం: మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి: ఐటీ సేవల విస్తరణకు పటాన్‌చెరు కేంద్రం కాబోతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతిపక్షాలు అధ్యక్షులను మార్చినా భారాస హ్యాట్రిక్ విజయం తథ్యమని చెప్పారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఫ్రీడం పార్కు, గ్రేటర్ డివిజన్ కార్యాలయం, డీసీసీబీ బ్యాంకు కార్యాలయం, ఆర్ అండ్ బీ అతిథి గృహాలను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం చెల్లిన నాయకులకు పట్టం కట్టినా భారాస విజయం తప్పదని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని ఆరోపించారు. దక్షిణ భారత్‌పై భాజపాకి చిన్నచూపు ఎందుకో అర్థం కావడం లేదన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు భారాస ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. మళ్లీ గెలిచిన తర్వాత పటాన్‌చెరుకు మెట్రో ఇస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ ఎల్ రమణను పరామర్శించిన కవిత





జగిత్యాల : కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ తండ్రీ (ఎల్‌జీ రాం) (92) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత రమణను సోమవారం పరామర్శించారు. అంతకుముందు ఎల్ జి రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కవిత వెంట ఎమ్మెల్యేలు సంజయ్, విద్యాసాగరావు, తదితరులు ఉన్నారు.కాగా, ఎల్‌జీ రాం జగిత్యాలలో రేడియో, సైకిల్ డీలర్, ఆ తర్వాత ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేశారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు ఎల్‌జీ రాం హెల్త్‌కేర్ సొసైటీ కింద పేద ప్రజలకు వైద్య సేవలందించారు. జగిత్యాలలో కొత్త బస్టాండ్ సమీపంలో ఎల్‌జీ రాం లాడ్జి నిర్మించి ప్రయాణికులకు సేవలందించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఇంట్లోనే ఉండగా, మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిన విషయం తెలిసిందే.

# భట్టి నివాసానికి జూపల్లి.. వారిమధ్య చర్చకు వచ్చిన అంశాలు ఇవే..



హైదరాబాద్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణా రావు భేటీ అయ్యారు. త్వరలో జూపల్లి కాంగ్రెస్‌లో చేరనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఉదయం భట్టి నివాసానికి చేరుకున్న ఆయన... కొద్దిసేపు సీఎల్పీ నేతతో ముచ్చటించారు. పాదయాత్ర విజయవంతపై భట్టికి జూపల్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూపల్లి మీడియాతో మాట్లాడుతూ... కొల్లాపూర్‌లో జరగబోయే బహిరంగ సభకు రావాలని భట్టిని కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అనేక విషయాలు యాత్రలో తెలుసుకున్నట్లు భట్టి చెప్పారన్నారు. నిన్న (ఆదివారం) మహబూబ్ నగర్ జిల్లా నేతలంతా కలిసి మాట్లాడుకున్నట్లు తెలిపారు. సభకు జాతీయ నేతలు రాబోతున్నారని.. సభను సక్సెస్ చెయ్యాలని చూస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి నేతల చేరికలు ఉంటాయన్నారు. కూచుకుల్లా దామోదర్ రెడ్డి ఆయన కుమారుడు, మేఘా రెడ్డితో పాటు చాలామంది నేతలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

**జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతున్నందుకు ధన్యవాదాలు: భట్టి :** జూపల్లి కాంగ్రెస్‌లో చేరుతున్నందుకు ధన్యవాదాలు అని భట్టి అన్నారు. జూపల్లి చేరిక పార్టీకి, రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్నారు. చేరిక సమయంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని.. సభ ద్వారా తెలంగాణ సమాజానికి ఓ మెసేజ్ వెళ్లనుందని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా నేతలు క్యాడర్ కదిలిరావాలని పిలుపునిచ్చారు. పాలమూరు సభ డేట్, ప్రియాంక గాంధీ షెడ్యూల్‌ను ఏఐసీసీ పెద్దలు ప్రకటిస్తారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఇద్దరు తెలంగాణ బీజేపీ కీలక నేతలకు కేంద్రం భద్రత కేటాయింపు.. వారెవరంటే..



హైదరాబాద్: తెలంగాణ బీజేపీ కీలక నేతలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్‌లకు కేంద్రం భద్రతను కల్పించింది. ఈ మేరకు కేంద్ర హెూంశాఖ సోమవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇరువురు నేతలకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలతో పాటు సీఆర్పీఎఫ్ భద్రతను కేంద్ర హెూంశాఖ కల్పించింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటలకు 'వై' ప్లస్ భద్రతను కేటాయించింది. ఈటలకు బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు 11 మందితో భద్రతా సిబ్బంది రక్షణగా ఉండనున్నారు. అలాగే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు 'వై' కేటగిరి భద్రతను కల్పిస్తూ కేంద్ర హెూంశాఖ నిర్ణయం తీసుకుంది. అర్వింద్‌కు సెక్యూరిటీగా 'వై' కేటగిరీలో మొత్తం 8 మంది భద్రతా సిబ్బంది రక్షణ కల్పించనున్నారు. ఈరోజు ఈటల, అరవింద్ నివాసాలకు కేంద్ర భద్రతా బలగాలు వెళ్లనున్నారు. కాగా.. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రాణహానీ ఉందంటూ ఈటల రాజేందర్‌తో పాటు ఆయన సతీమణి చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఓ నేత రాజేందర్‌ను చంపేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇందుకోసం రూ. 20కోట్లు సుపారీ తీసుకున్నట్లు ఈటల సతీమణి ఆరోపించారు. ఈ ఆరోపణలపై మంత్రి కేటీఆర్ కూడా స్పందించారు. ఈటల భద్రతపై ఆరా తీశారు. అలాగే డీజీపీకి ఫోన్ చేసి ఈటల భద్రతపై కూడా చర్చించారు.

–మంత్రి ఆదేశాల మేరకు ఐపీఎస్ అధికారి ఒకరు ఈటల ఇంటికి వెళ్లి భద్రతపై మాట్లాడారు. ఇదిలా ఉండగా ఈటల రాజేందర్ కూడా ఈ విషయంపై ఢిల్లీ పెద్దలతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈటలకు భద్రతను కేటాయిస్తూ కేంద్ర హెూంశాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే అటు ఎంపీ ధర్మపురి అరవింద్ కూడా కేంద్ర హెూంశాఖ వై కేటగిరి భద్రతను కేటాయించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఎంపీ అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గులాబీ శ్రేణులు భగ్గుమన్నారు. ఎంపీ ఇంటిపై కవిత అనుచరులు దాడి చేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఎంపీకి కూడా కేంద్ర భద్రతను కేటాయించింది.



# మీటింగులతో ఉపయోగముంటుందా ?


హైదరాబాద్ : పాపం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చాలా కష్టపడి దక్షిణాది రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ పార్టీ ఆఫీసు లో దాదాపు ఏడు గంటలసేపు పార్టీ పరిస్థితుల పై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. తెలంగాణా తో కలిపి ఏపీ కర్నాటక తమిళనాడు కేరళ పాండిచ్చేరి రాష్ట్రాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. నడ్డా నిర్వహించిన తాజా మీటింగుతో రాబోయే ఎన్నికల్లో గెలుపు అంతసులభం కాదని బాగా అర్థమైనట్లే అనిపిస్తోంది. వచ్చేఎన్నికల్లో అధికారం లోకి రావటం ఖాయమనే నమ్మకం మోడీ లో నిజంగానే ఉండుంటే నడ్డా ఆధ్వర్యంలో ఇపుడు దక్షిణాది రాష్ట్రాల మీటింగ్ జరిగుండేదే కాదు. ఇంత సడెన్ గా దక్షిణాది రాష్ట్రాల మీటింగ్ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది ? ఏమొచ్చిందంటే ఉత్తరాధిలో పార్టీ గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదనే అనుమానాలు పెరిగిపోతుండటమే. ఉత్తరాధి లో జరుగుతుంది అనుకుంటున్న నష్టాన్ని దక్షిణాది రాష్ట్రాల్లో భర్తీ చేసుకోవాల ని మోడీ అనుకుంటున్నారు. అయితే ఇక్కడ సమస్య ఏమిటంటే హెూలుమొత్తంమీద దక్షిణాది లో బీజేపీ కి కర్నాటక లో తప్ప ఇంకెక్కడా బలం లేకపోవటమే. కర్నాటక లో మాత్రం అప్పుడప్పుడు అధికారం లోకి వస్తు పోతుంటుంది. ఇందులో భాగంగానే కొన్ని ఎంపీ సీట్లలో కూడా గెలుస్తుంటుంది. ఈమధ్యనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కి ఓడిపోయింది. తమిళనాడు కర్నాటక కేరళ లో పార్టీకి ఒక్కటంటే ఒక్కసీటు కూడా లేదు. మోడీ ప్రధానంగా పార్లమెంటు స్థానాల మీదే దృష్టిపెట్టారు. తెలంగాణా లో మాత్రం నాలుగు ఎంపీ సీట్లున్నాయి. రాబోయే ఎన్నికల్లో ఈ నాలుగు సీట్లను నిలుపుకుంటే చాలా ఎక్కువనే చెప్పాలి. సో ఏ పద్దతి లో చూసినా దక్షిణాది లో చెప్పుకోదగ్గ బలం పుంజుకునేట్లు కనబడటంలేదు. అందుకనే హడావుడిగా నడ్డాతో సౌత్ స్టేట్స్ మీటింగ్ పెట్టించారు. పార్టీకి సంస్థాగతంగా బలంలేనపుడు ఏ అధ్యక్షుడు మాత్రం ఏమిచేయగలరు ? ఇపుడీ విషయమే నరేంద్రమోడీ లో బాగా టెన్షన్ పెంచేస్తున్నట్లున్నారు. దాని ప్రభావం తోనే నడ్డా అందరిపైనా మండిపడినట్లు సమాచారం. ఉత్తరాధిలో పార్టీ బలంగా ఉన్నపుడు దక్షిణాది లో ఎందుకు లేదని నిలదీశారట. నడ్డా ప్రశ్నకు ఎవరు మాత్రం ఏమి సమాధానం చెప్పగలరు ?

# విజయేంద్ర ప్రసాద్ తో బండి సంజయ్ భేటీ... తెరపైకి కొత్త చర్చ!



హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ బీజేపీ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. వీటి లో ప్రధానంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని మార్చడం మరింత హాట్ టాపిక్ గా మారిందని అంటున్నారు. ఈ సమయం లో తెలంగాణ బీజేపీ మాజీ చీఫ్ బండి సంజయ్... దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఇంటికి వెళ్లారని తెలుస్తుంది! అవును... ఆదివారం సాయంత్రం సమయం లో తెలంగాణ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్.. ప్రముఖ సినీ రచయిత పార్లమెంటు సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ ని ఆయన నివాసం లో కలవడానికి వెళ్లారని తెలుస్తుంది. వీరిద్దరూ చాలా సమయం భేటీ అయ్యారని అంటున్నారు. ఇదే సమయం లో వీరి భేటీ పూర్తిగా ఏకాంతంగా జరిగిందని సమాచారం. దీంతో వీరిద్దరి భేటీ పై ఆసక్తికరమైన చర్చ నడుస్తుంది. యితే విజయేంద్ర ప్రసాద్ కూడా బీజేపీ కి చాలా కావాల్సిన మనిషి అనే కామెంట్లు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తుంటాయి! భారత రాష్ట్రపతి నామినేట్ చేసే ప్రముఖుల కేటగిరీ లో విజయేంద్ర ప్రసాద్ ను రాజ్యసభ కు నామినేట్ చేసే విషయంలో బీజేపీ పెద్ద పాత్ర పోషించిందని చెబుతుంటారు. దీంతో పార్టీ పెద్ద లతో విజయేంద్రప్రసాద్ కు సత్సంబంధాలు ఉన్నాయనే మాటలు వినిపిస్తుంటాయి! ఇదే సమయం లో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ ను తొలగించిన అనంతరం ఆయన ఇప్పుడు పార్టీ జాతీయ కార్యవర్గం లోని 10 మంది నామినేటెడ్ సభ్యుల లో ఒకరనేది తెలిసిన విషయమే! దీంతో వీరిద్దరి భేటీ వెనక కీలక విషయాలే దాగున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీంతో... రాబోయే 2024 లోక్ సభ ఎన్నికల లో తమ కు అనుకూలంగా మారడానికి సహాయపడే జాతీయవాద సినిమాలు లేదా కంటెంట్ ని రూపొందించడానికి బీజేపీకి సహకరించాల ని బండి సంజయ్... విజయేంద్రప్రసాద్ ని కలిసి ఉంటారనే ఊహాగాణాలు బలంగా వినిపిస్తున్నాయి. కాగా... ఆర్.ఆర్.ఆర్. సినిమా కు సంబంధించి కొమరం భీమ్ ను ముస్లింగా చూపించినందుకు బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయం లో ట్రిపుల్ ఆర్ సినిమాను ప్రదర్శించే థియేటర్లను తగలబెడతామని అప్పట్లో బండి సంజయ్ బెదిరించారంటూ వార్తలొచ్చాయి. అయితే ఈ ఏడాది సినిమా ఆస్కార్ ను గెలుచుకున్న సమయం లో మాత్రం స్వరం మార్చిన సంజయ్... ఆర్.ఆర్.ఆర్. టీం ను అభినందించారు!

# మోడీ వరంగల్ మీటింగ్ లో ఆ ముగ్గురూఎక్కడ?



హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణలోని అధికార బీఆరెస్స్ జంపింగులు అసంతృప్తులూ లేకుండా జాగ్రత్తలు తీసుకునే పనిలో ఉంటే.. మరిన్ని చేరికల కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తులు చేస్తుంటే... బీజేపీ మాత్రం అంతర్గత సమస్యలతో సతమవుతున్నట్లు కనిపిస్తుందని అంటున్నారు పరిశీలకులు. వీటికి బలం చేకూరుస్తూ... ప్రధాని మోడీ సభకు ముగ్గురు కీలక నేతలు గైర్హాజరయ్యారనే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అవును.. సాధారణంగా ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి హాజరయ్యే సభలు సమావేశాల్లో పాల్గొనేందుకు స్థానిక నాయకులు పోటీపడుతుంటారని అంటుంటారు. ఇదే సమయంలో వివిధ కార్యక్రమాల ద్వారా ఆ సభల్లో తమ ఉనికిని హైలైట్ చేయడం కోసం ప్రయత్నిస్తుంటారని.. తద్వారా అధినేతల ఆకర్షణను పట్టుకోవడానికి తాపత్రయ పడుతుంటారని అంటుంటారు. అయితే కొన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోడీ వరంగల్ జిల్లాకు చేరుకున్న సమయంలో తెలంగాణ బీజేపీకి చెందిన ముగ్గురు నేతలు ఆ కార్యక్రమానికి గైర్హాజరయ్యారని తెలుస్తుంది. పైగా వీరంతా నిన్నమొన్నటివరకూ పార్టీ కార్యక్రమాల్లో హడావిడిగా కనిపించినవారే కావడంతో ఈ ఇష్యూ మరింత హాట్ టాపిక్ అయ్యింది. అవును... రైల్వే వ్యాగన్ సెంటర్ తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు నరేంద్ర మోడీ వరంగల్ జిల్లాలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇది ఎన్నికల సీజన్ కావడంతో నేతలందరూ వేదిక వద్దకు చేరుకుని.. తమకు టిక్కెట్టు ఇచ్చే అవకాశాలను పెంచాలని ప్రధానిని కోరుతున్నారని తెలుస్తుంది. అయితే ఈ కీలకమైన కార్యక్రమానికి విజయశాంతి వివేక్ చంద్రశేఖర్ గైర్హాజరయ్యారని తెలుస్తుంది. దీంతో రకరకాల విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి! ఎన్నికలు సమీపిస్తున్న వేళ స్వయంగా ప్రధానమంత్రి పాల్గొనే మీటింగ్ కు ఈ ముగ్గురూ కీలక నేతలూ గైర్హాజరవ్వడంతో వీరంతా బీజేపీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని.. కాంగ్రెస్ వైపు మొగ్గు చూపాలని యోచిస్తున్నారని ప్రచారం జరుగుతోంది! ఇందులో భాగంగా... ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో వివేక్ చంద్రశేఖర్ లు టచ్ లో ఉన్నారనే టాక్ రాజకీయ వార్గాల్లో బలంగా వినిపిస్తుందని సమాచారం!! అయితే కొన్ని రోజుల క్రితం తెలంగాణ బీజేపీ చీఫ్ మార్పు జరగడంతో... ఇప్పుడు ఆ పోస్ట్ లో కిషన్ రెడ్డి చేరిన సంగతి తెలిసిందే! అయితే పైన చెప్పుకున్న ఈ ముగ్గురు నేతలకూ కిషన్ రెడ్డితో సత్సంబంధాలు లేవనే చర్చ ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనికి తోడు రాబోయే ఎన్నికల్లో టిక్కెట్ల విషయంలో కూడా ఈ ముగ్గురికి సరైన హామీ రాలేదనే టాక్ వినిపిస్తోంది. అదేవిదంగా... తన సేవలను బీజేపీ సక్రమంగా వినియోగించుకోలేదని విజయశాంతి బహిరంగంగానే వ్యాఖ్యానించారు కూడా! దీంతో ఈ పరిణామాలన్నింటినీ బేరీజు వేస్తున్న పరిశీలకులు... వీరు త్వరలో ఒక కీలక నిర్ణయం తీసుకునే అవకాశం పుష్కలంగా ఉందని అంటున్నారు. మరి వాట్ నెక్స్ట్ అనేది వేచి చూడాలి!!

# భవిష్యవాణిలో అమ్మవారు అలా చెప్పడం సంతోషాన్నిచ్చింది: మంత్రి తలసాని



హైదరాబాద్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు ఎలాంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు జరిగాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమ్మవారు భవిష్యవాణిలో బోనాల కార్యక్రమం బాగా జరిగిందని చెప్పడం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్ర పండుగ అయిన బోనాలకు అన్ని శాఖలు సహకరించాయని తెలిపారు. మహంకాళి బోనాల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమం ఘనంగా జరిగింది. మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ కార్యక్రమంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. మరికాసేపట్లో పోతరాజుల ఊరేగింపు, ఘటోత్సం జరుగుతాయన్నారు. లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, రాత్రి అంతా దర్శనాలు జరిగాయని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రులు, వివిధ పార్టీల పెద్దలు దర్శనం అమ్మవారిని దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. ఒకప్పుడు రాజకీయ నేతలు దర్శనం తరువాత వర్షాలు పడాలి అని కోరుకునే వారని చెప్పారు. 2014 తరువాత రైతాంగం అంతా సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. బోనాలకు సహకరించిన అన్ని విభాగాలకు ధన్యవాదాలు తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com